మంగళవారం
23-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 63
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కాషాయం

రంకెలు...

- దేశమంతటా మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కార్యాచరణ
- పాలనలో అంతేలేకుండా పోతున్న బీజేపీ ఆగడాలు
- కర్ణాటకలో మరో అయోధ్య చిచ్చుకు సకలయత్నాలు
- బాబాబుడాన్ దర్గాను హిందూ ఆలయంగా మార్చే కుట్ర

దేశంలో కాషాయ మూకలు రంకెలు వేస్తున్నాయి. విభిన్న సంస్కృతుల ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు నయా కార్యాచరణను రూపొందిస్తున్నాయి. ఇప్పటికే అధికారమే పరమావధిగా, హిందూ మత రాజ్యమే ధ్యేయంగా, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి రాజ్యాంగ విలువలకు నీళ్లొదిలి ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలదోసి గద్దె నెక్కుతున్నాయి. బీజేపీ పాలకులు మతం పేరుతో సృష్టిస్తోన్న మారణ హోమాలకు అంతేలేకుండా పోతోంది. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఇతర మతాల ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, మసీదులను కూలగొట్టి ఆక్రమించే యత్నాలను యదేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. 2002లో గుజరాత్ మారణ హోమం తర్వాత కర్ణాటక మరో గుజరాత్ అవుతుందని, బాబాబుడాన్ దర్గా మరో అయోధ్య అవుతుందని సంఘ్‌పరివార్, బీజేపీ కర్ణాటకలో రణగొణధ్వనులు చేస్తున్నాయి.

బెంగళూరు: కర్ణాటకలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కనికరంలేని కాషాయీకరణ విధానానికి తాజా నిదర్శనం బాబాబుడాన్ దర్గా. హిందూ ఆగమ ఆరాధన పద్ధతులను పాటించేందుకు అర్చక, ముజావర్‌లను నియమించే అధికారంతో చారిత్రక బాబాబుడాన్ దర్గా మతపరమైన, పరిపాలనా వ్యవహారాలను నిర్వహించడానికి ఒక పరిపాలనా కమిటీని ఏర్పాటు చేయడం కాషాయ పార్టీ మతోన్మాదాన్ని తేటతెల్లం చేస్తోంది. ప్రతి సంఘం నుంచి నలుగురు సభ్యులు ఉండే పరిపాలనా కమిటీలో సభ్యత్వం కోసం ప్రభుత్వం హిందూ, ముస్లిం సంఘాల నుంచి దరఖాస్తులను కూడా ఆహ్వానించింది. అందులో ఇద్దరు మహిళలు, ఒకరు షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ తెగల నుంచి ఉంటారు. కానీ అది స్పష్టంగా ప్రజాస్వామ్య ప్రక్రియలా కనిపిస్తోంది. కానీ పుణ్యక్షేత్రం సమకాలీన స్వభావాన్ని క్రమంగా నాశనం చేసి, దానిని ప్రత్యేకంగా దత్తాత్రేయ దేవాలయంగా మార్చే లక్ష్యంతో ఇది తప్పనిసరిగా మతపరమైన కుట్ర. ఈ దర్గా చుట్టూ చారిత్రక మతపరమైన అంశాలను పరిశీలిస్తే అసలు విషయం స్పష్టమవుతుంది. అధికారికంగా 'శ్రీ గురు దత్తాత్రేయస్వామి బాబాబుడాన్ దర్గా' అని పిలవబడే చారిత్రాత్మక దర్గా పశ్చిమ కనుమలలో 'దాదా కీ పహాడ్' అని ప్రసిద్ధి చెందిన కొండపైన ఉంది. దాదా హయత్ మీర్ ఖలందర్ అనే ఒక సూఫీ సన్యాసిని సూచిస్తుంది. 17వ శతాబ్దంలో యెమెన్ నుంచి వచ్చాడని విశ్వసించబడే బాబాబుడాన్ తర్వాత ఈ ప్రాంతంలో దేశంలోనే మొదటిసారిగా కాఫీ సాగును ప్రవేశపెట్టిన ఘనత కలిగిన బాబాబుడాన్ దర్గాగా ఇది మరింత ప్రాచుర్యం పొందిందని చరిత్ర సూచిస్తుంది. అయితే అతికొద్ది కాలంలోనే హిందూ, ముస్లిం వర్గాలకు చెందిన అణగారిన ప్రజల నుంచి ఆ దర్గా పట్ల విశ్వాసం పెరిగింది. టిప్పు సుల్తాన్ కాలం నుంచి అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం... 1792 నుంచి కచ్చితంగా

- మిగతా 2 లో

నేడు విద్యా సంస్థల

బంద్

- విద్యార్థి సంఘాల జేఏసీ పిలుపు
- జాతీయ విద్యావిధానం-2020 రద్దు చేయాలి
- ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రాథమిక నుంచి ఉన్నత విద్యా సంస్థల (కేజీ టు పీజీ) వరకు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23వ తేదీ మంగళవారం బంద్‌కు విద్యార్థి జేఏసీ పిలుపునిచ్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ముందస్తుగా సెలవులను ప్రకటించాయి. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, పీడీఎస్‌యూ, ఏఐడీఎస్‌వో తదితర విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. జాతీయ విద్యా విధానం పేరుతో బీజేపీ ప్రభుత్వం చేసిన కుట్రకు పూర్తిస్థాయి మద్దతు పలికి, సీఎం జగన్ జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడాన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీనికి అనుకూలమైన ఉత్తర్వులు నంబరు-84 85 117 118 ఉత్తర్వుల వల్ల నష్టం జరుగుతోందని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. గ్రామంలో మూడు కిలోమీటర్ల లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలన్నీ మూసి వేయడం, 3,4,5 తరగతుల విలీనం ద్వారా పేద విద్యార్థులకు చదువుకు దూరమయ్యే ప్రమాదముంది. ఇప్పటికే విద్యార్థులు హాజరుశాతం 14 నుంచి 16శాతానికి పెరిగిందని, ఇది కేవలం కార్పొరేట్/ప్రైవేట్ విద్యాసంస్థలకు అనుకూలమైన విద్యావిధానం, వాటిల్లో 3,4,5 తరగతుల విలీనం ద్వారా ఎక్కువ శాతం కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేరడానికి ప్రమాదముంది. కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు, దుస్తులు, పుస్తకాల

- మిగతా 2 లో

గిరిజన రైతు పోరాటాల్లో

రాటుదేలిన సూరిబాబు

విశాఖజిల్లాలోని మన్యం ప్రాంతంలో ఉదయించిన ఎర్రసూరీడు కామ్రేడ్ మేకా సూరిబాబు. భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం అంటూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఇచ్చిన రణనినాదాన్ని ఊపిరిగా గిరిజనంలో ఆయన వెలిగించిన ఉద్యమ స్ఫూర్తి అజరామరం. ఉమ్మడి విశాఖ జిల్లాలో 1932 డిసెంబరు 22న గొలిగొండ మండలం కృష్ణదేవి పేటలో (పాతూరు) మేకా వెంకట రావు, చెల్లయ్యమ్మ దంపతులకు జన్మించిన మేకా సూరిబాబు అప్పటికే అల్లూరి సీతారామరాజు నడిపిన మన్యం విప్లవ ప్రభావం, ఆనాటి విప్లవకారుడు సీతారామయ్య పరిచయంతో వామపక్ష ఉద్యమానికి ఆకర్షితుడయ్యారు. మార్క్సిస్టు, లెనినిస్టు భావజాలంతో 1952లో భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. బ్రిటీష్ పాలకులు తమ పాలనా సౌలభ్యం కోసం మొఖాసాదారులు, ముఠాదారులను ఏర్పాటు చేసి వారికి భూములు అప్పగించారు. ఈ భూములను తమ చేతుల్లో పెట్టుకుని ఆదివాసీలపై దోపిడీ, దౌర్జన్యం చిత్రహింసలకు పాల్పడేవారు. వీరితోపాటు అటవీ అధికారులు, వడ్డీ వ్యాపారులు గిరిజనులను జలగల్లా పీల్చుకుతినేవారు. ఈ దారుణాలకు అడ్డుకట్ట వేయాలని, అటవీ భూములతో పాటు మొఖాసాదారులు, ముఠాదారుల కింద ఉన్న భూమి గిరిజనులకు చెందాలని మేకా సూరిబాబు గిరిజనులను సమీకరించి నర్సీపట్నం, కొయ్యూరు, చింతపల్లి, పాడేరు ప్రాంతాలలో గిరిజన రైతాంగ పోరాటాలను నిర్మించారు. ప్రజా సంఘాలను నిర్మిస్తూ భూస్వాముల, దళారీలకు వ్యతిరేకంగా ఉధృతమైన పోరాటాల్ని నిర్మించారు. ఆ ప్రాంతాలను భారత కమ్యూనిస్టు పార్టీకి పట్టుగొమ్మలుగా తయారు చేశారు. ఈ క్రమంలో అనేకరకాలైన పోలీసు నిర్బంధాలను, భూస్వాముల అకృత్యాలను ఎదుర్కొన్నారు. సూరిబాబు నాయకత్వంలో ఏజెన్సీలోని పారికలపాడు భూపోరాటం ఆ ప్రాంతంలోని సుమారు వంద గ్రామాలను ప్రభావితం చేసింది. పేదలకు భూములు పంచాల్సిందేనన్న డిమాండు ఊపందుకుంది. గ్రామాలకు గ్రామాలు ఉద్యమంతో మమేకమయ్యాయి. సహించలేకపోయిన భూస్వాములకు అనుకూలంగా పోలీసులు అరెస్టులు, లాఠీచార్జిలతో ఏజెన్సీ ప్రాంత ప్రజలను భయబ్రాంతులకు గురి చేసినా సూరిబాబు అందించిన పోరాట స్ఫూర్తి ముందు అవి దిగదుడుపయ్యాయి. ప్రజా ఉద్యమాన్ని తట్టుకోలేకపోయిన ప్రభుత్వం అటవీశాఖ పరిధిలోని 27 వేల ఎకరాల భూమిని గిరిజనులకు స్థిర వ్యవసాయం చేసుకునేందుకు అప్పగించాల్సి వచ్చింది. అనంతర కాలంలో నిమ్మగడ్డ, కొమ్మిక, కసిమి, సీతఖండి తదితర ప్రాంతాల్లోని వ్యవసాయం చేసుకుంటున్న కౌలు రైతులను ఆ భూముల నుంచి వెళ్లగొట్టేందుకు మొఖాసాదారులు, అటవీశాఖ అధికారులు దౌర్జన్యకాండకు తెగబడ్డారు. ఈ నేపథ్యంలో కౌలు రైతులంతా సూరిబాబు నేతృత్వంలో సమరశీల ఉద్యమాన్ని నడపడంతో కౌలుదార్లకు వేల ఎకరాల భూములపై హక్కులు దక్కాయి. సూరిబాబు ఉన్నంత కాలం తమ కార్యకలాపాలు సాగవని భావించిన శక్తులు 1987 నవంబరు 27 రాత్రి సూరిబాబుపై తూటాలు కురిపించి హతమార్చారు. సూరిబాబును భౌతికంగా దూరమైనా ఆయన చూపిన పోరాటమార్గం గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచింది. అనంతర కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావాన్ని చూపింది. కొయ్యూరు, గొలుగొండ, చింతపల్లి, తదితర 37 గ్రామాల్లో సీపీఐ అభ్యర్థులే సర్పంచులుగా గెలుపొందారు. 40కి పైగా ఎంపీటీసీ స్థానాల్లో సీపీఐ విజయకేతనం ఎగురవేసింది. నీటిలో చేపలా ప్రజలలో మమేకం కావాలన్న లెనిన్ సూత్రాన్ని అక్షరాలా పాటించి కమ్యూనిస్టు నీతికి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా సాగిన మేకా సూరిబాబు జీవితం నేటి తరానికి ఆదర్శం.

పది పరీక్షల్లో...

ఇక ఆరు పేపర్లే

- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఇక ఆరు పేపర్లతోనే నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022-23 విద్యా సంవత్సరం నుంచి ఈ విధానం అమలులోకి రానుంది. రాష్ట్రంలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్న నేపథ్యంలో ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లు నిర్వహించాలని నిర్ణయించింది.

గతంలో పది పరీక్షల్లో 11 పేపర్లు ఉండగా, కరోనా నేపథ్యంలో వాటిని 7 పేపర్లకు ప్రభుత్వం కుదించింది. సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా ఆరు సబ్జెక్టులకుగాను ఆరు పేపర్లు ఇక నుంచి నిర్వహిస్తారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకుగాను ప్రభుత్వం ఈ విధానం తీసుకుంది. ఏడాది పొడవునా పరీక్షలు నిర్వహిస్తున్నందున 11 పరీక్షలు అవసరం లేదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇప్పటివరకు వేర్వేరుగా నిర్వహించిన ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ పేపర్లను, ఇక ముందు ఒకే పేపరుగా పెడతారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం విధానాన్ని తీసుకొచ్చారు. దీనిపై చాలా ప్రైవేట్ విద్యా సంస్థలు హైకోర్టును ఆశ్రయించగా, వాటికి అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో ప్రభుత్వం వ్యూహాత్మకంగా సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది.

సీబీఎస్ఈ పాఠశాలల్లో బోధనా సమస్యలు

రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానం అమలైతే, బోధనా సమస్యలు ఎదురవుతాయి. ఇప్పటికే 220 పాఠశాలలకు ఈ విద్యా సంవత్సరానికి సీబీఎస్ఈ గుర్తింపు రానుంది. మరిన్ని పాఠశాలలకు రావాల్సి ఉంది. ప్రభుత్వం ఆర్భాటంగా సీబీఎస్ఈ విధానం తీసుకొచ్చిందేగానీ, దానికి సరిపడా బోధించే అనుభవం గల, విద్యార్హతల గల ఉపాధ్యాయులను

- మిగతా 2 లో

మోదీకి మళ్లీ అవే సమస్యలు

- మూడేళ్లుగా వినతిపత్రాలతోనే సరి
- ఒక్క సమస్యా పరిష్కారానికి నోచుకోని వైనం
- తాజాగా మరోసారి ప్రధానితో సీఎం జగన్ భేటీ
- రాష్ట్రపతి, కేంద్రమంత్రులతోనూ వరుస సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హస్తిన పర్యటనలో పురోగతి కానరావడం లేదు. దిల్లీ వెళ్లిన ప్రతిసారీ ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాలతో పాటు ఇద్దరు, ముగ్గురు కేంద్ర మంత్రులను కలిసి విభజన చట్టానికి సంబంధించిన అంశాలు అమలు చేయమని కోరుతున్నారు. వాస్తవానికి ప్రధానితో సీఎం జగన్ భేటీలో ఏ అంశాలు చర్చకొస్తున్నాయో బయట ప్రపంచానికి తెలియదు గాని, మీడియాకు మాత్రం రాష్ట్రానికి సంబంధించి విభజన అంశాలు, కొన్ని పెండింగ్ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రకటన విడుదల చేస్తున్నారు. గత మూడేళ్లుగా అవే అంశాలు తరచూ ప్రస్తావించడం, వాటిల్లో ఒక్కటి కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం. విచిత్రమేమిటంటే సీఎం ఇచ్చే వినతిపత్రంలో ఒక్క సమస్యపై కూడా ప్రధాని స్పందించినట్లు గాని, సీఎం ఒత్తిడి చేయడం గాని లేకపోవడం విశేషం. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కీలక బిల్లుల సమయంలో గాని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల వంటి కీలక సందర్భాల్లో సైతం సీఎం జగన్ కేంద్రానికి బేషరతు మద్దతు తెలియజేయడం తప్ప, ఆ అవకాశాలను రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగించుకునే ప్రయత్నం చేయడం లేదు. తాజాగా సోమవారం ముఖ్యమంత్రి జరిపిన హస్తిన పర్యటన కూడా అలాగే జరిగింది. లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ప్రధాని నివాసంలో మోదీని కలిసి పోలవరం రీసోర్స్ గ్యాప్ కింద నిధులు, జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హుల ఎంపికలో హేతుబద్ధత, విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా తదితర అంశాలపై వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సత్వరమే పూర్తిచేయడానికి తగిన సహాయ సహకారాలు అందించాలని

- మిగతా 2 లో



ఆప్‌ను చీలిస్తే సీఎం చేస్తారట

- కేసులన్నీ ఎత్తేస్తారట
- తలైనా నరుక్కుంటా గానీ...
- బీజేపీపై సిసోడియా సంచలన వ్యాఖ్యలు

8 లో

29న

మంత్రివర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 29వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశం జరగనుంది. ఆ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ అజెండాను రూపొందించేందుకు ఆయా శాఖా కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే నెలలో శాసనసభ వర్షాకాల సమావేశాలను నిర్వహించాల్సి ఉంది. వాస్తవానికి గత నెలలోనే అసెంబ్లీ సమావేశాలు జరగాల్సి ఉన్నా గడప గడపకు వైసీపీ ప్రభుత్వం నిర్వహణ కారణంగా వాయిదా వేశారు. తొలుత రాష్ట్రపతి ఎన్నికలకు కొనసాగింపుగా నిర్వహించాలని భావించి చివరి నిమిషంలో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ఇక ఈనెల 29న జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో వచ్చే నెల జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో పెట్టనున్న కీలక బిల్లులపై చర్చించే అవకాశం ఉంది. అలాగే పోలవరం, మూడు రాజధానుల అంశాలు చర్చకొచ్చే అవకాశాలున్నాయి. పోలవరం పునరావాస అంశాల పైన కేంద్రం తీవ్ర జాప్యం చేస్తున్నందున, ఏ విధంగా ముందుకెళ్లాలనే దాని పైన ఈ కేబినెట్‌లో నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

లేబర్ కోడ్‌ల అమలుతో

కార్మికుల మెడకు ఉరితాడు

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలి
- రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ నిరసనలు
- ఇతర కార్మికసంఘాల సంఘీభావం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేయటానికి రాష్ట్రాల సహకారం కోసం ఈనెల 25, 26లలో తిరుపతిలో వివిధ రాష్ట్రాల కార్మిక మంత్రిత్వ శాఖలతో కేంద్రం ఏర్పాటు చేసిన కీలక సమావేశానికి జగన్ ప్రభుత్వం ఆతిథ్యం ఇచ్చి సహకరించే విధానాన్ని తక్షణం విరమించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, కార్యదర్శి బి.కొండలరావు డిమాండ్ చేశారు. తిరుపతి సదస్సు నిర్వహణను నిరసిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ అధ్వర్యాన కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఒంగోలులో ఆర్.రవీంద్రనాథ్, గుంటూరులో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, విజయవాడలో కొండలరావు, నర్సాపురంలో నెక్కంటి సుబ్బారావుతో పాటు అన్ని జిల్లాల్లో ఏఐటీయూసీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆందోళనల్లో పాల్గొన్నారు. తిరుపతి

- మిగతా 2 లో

20 కోట్లమంది పిల్లలు

చదువుకు దూరం

- పిల్లల అక్రమ రవాణాపై సమగ్రచట్టం అవసరం
- ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సదస్సులో కైలాశ్ సత్యార్థి పిలుపు

2 లో

రష్యాలో ఆత్మాహుతి బాంబర్ అరెస్టు

భారత్‌లో ఉగ్ర దాడికి ఐఎస్ఐఎస్ కుట్ర

మాస్కో: భారత్‌లో ఉగ్ర దాడికి ఐఎస్ఎస్ ఉగ్రవాద సంస్థ కుట్ర పన్నింది. కేంద్రంలో అధికారంలో ఉన్న కీలక నేత హత్యకు పథకం రూపొందించింది. ఇందు కోసం ఒక ఆత్మాహుతి బాంబర్‌ను రంగంలోకి దించింది. అయితే ఆ ఉగ్రవాది రష్యాలో పట్టుబడ్డాడు. రష్యన్ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌బీ) ఈ మేరకు సోమవారం ప్రకటించింది. రష్యా న్యూస్ ఏజెన్సీ స్పుత్నిక్ ఈ విషయాన్ని వెల్లడించింది. రష్యాలో నిషేధించిన ఇస్లామిక్ స్టేట్ అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ సభ్యుడిని రష్యన్ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌బీ) గుర్తించి, నిర్బంధించినట్లు తెలిపింది. ఆ ఉగ్రవాది మధ్య ఆసియా ప్రాంతంలోని ఒక దేశానికి చెందినవాడని పేర్కొంది. ఆ ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చుకుని భారత్‌లో అధికారంలో ఉన్న కీలక రాజకీయ నేతను హత్య చేసేందుకు పథకం పన్నినట్టు తెలిపింది. ఎఫ్ఎస్‌బీ నిర్బంధించిన ఆ వ్యక్తిని ఆత్మాహుతి బాంబర్‌గా టర్కీలో ఐఎస్ఐఎస్ నియామకం చేసినట్లు వివరించింది.కాగా, భారత్‌లో కూడా తన ఉనికిని చాటేందుకు ఐఎస్ఐఎస్ గత కొంత కాలంగా ప్రయత్నిస్తున్నది. అలాగే సోషల్ మీడియా ద్వారా తన సిద్ధాంతాన్ని వ్యాపించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు సైబర్ యాక్టివిటీపై నిఘా పెట్టాయి. మరోవైపు ఐఎస్ఐఎస్‌తోపాటు దాని అనుబంధ ఉగ్రవాద సంస్థలపై కేంద్రం ప్రభుత్వం నిషేధం విధించింది. ఆ ఉగ్రవాద సంస్థలను చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టంలోని మొదటి షెడ్యూల్‌లో చేర్చింది.

ఇమ్రాన్‌పై ఉగ్రవాద చట్టం కేసు

ఇస్లామాబాద్: ఉగ్రవాద చట్టం కింద పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోసం సోమవారం ఇస్లామాబాద్ హైకోర్టును ఇమ్రాన్ ఆశ్రయించారు. ఇటీవల జరిగిన ఓ పబ్లిక్ ర్యాలీలో మహిళా జడ్జితో పాటు కొందరు సీనియర్ పోలీసు అధికారులకు ఇమ్రాన్ ఖాన్ బెదిరింపులు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం యాంటీ టెర్రరిజం యాక్ట్‌లోని సెక్షన్ 7 కింద ఇమ్రాన్‌పై కేసు నమోదు చేశారు. ఇమ్రాన్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాదులు బాబర్ అవాన్, ఫైసల్ చౌదరీ ఇవాళ కోర్టును కోరారు. అధికారంలో ఉన్న పీడీఎం ఇమ్రాన్‌ను కావాలనే లక్ష్యంగా చేసినట్లు పిటిషన్‌లో న్యాయవాదులు ఆరోపించారు. ఇమ్రాన్‌ను అరెస్టు చేస్తారేమో అన్న ఉద్దేశంతో ఆయన అభిమానులు భారీ సంఖ్యలో ఇంటి వద్దకు చేరుకున్నారు. ఏప్రిల్‌లో ఇమ్రాన్ తన పదవిని కోల్పోయిన విషయం తెలిసిందే. దేశ ద్రోహం చట్టం కింద తన సన్నిహితుడిని హింసిస్తున్నారని ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు.

అసమానతలకు వ్యతిరేకంగా పోరు

దక్షిణాఫ్రికా సీపీ పిలుపు

జోహెన్స్‌బర్గ్: అసమానతలకు వ్యతిరేకంగా కార్మికులు, కార్మిక సంఘాలు ఏకంకావాలనీ, పెట్టుబడిదారీ యజమానుల దోపిడీకి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాలు చేయాలని దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ (ఎస్‌ఏసీపీ) పిలుపునిచ్చింది. మరికానా ఊచకోత విషాదం 10వ వార్షికోత్సవాన్ని ఇటీవల నిర్వహించారు. 2012 ఆగస్టు 16న మెరుగైన వేతనాలు, గృహనిర్మాణం కోసం డిమాండ్ చేస్తూ గని సమీపం లోని కొండపై గుమిగూడిన ప్లాటినం గని కార్మికులపై పోలీసులు కాల్పులు జరప డంతో 34 మంది మరణిం చగా, 78 మందికి గాయాల య్యాయి. ఈ విషాద ఘటనకు ముందు, ఆ తర్వాత, దాడికి గురైన కార్మికు లకు, మరణించిన వారి కుటుం బాలకు, లైంగిక వేధిం పులకు, అత్యాచారానికి గురైన మహిళా కార్మికులకు ఎస్‌ఏసీపీ తన ప్రగాఢ సానుభూతి, సంఘీభావం తెలిపింది. మైనింగ్ యజమానులు చేతుల్లో కార్మికుల హత్యలు, 2007/8లో ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం, తగ్గిన ప్లాటినం ధరలు పర్యవసానంగా యజమానులు తమ ప్రైవేట్ లాభాలకు ప్రాధాన్యతనిస్తూ కార్మికులపై హింసాత్మక చర్యలకు ఒడిగట్టింది. నేరస్తులందరినీ చట్టంలోకి తీసుకురావాలని నేర న్యాయ వ్యవస్థ కోసం ఎస్‌ఏసీపీ పిలుపును పునరుద్ఘాటించింది. సంవత్సరాలుగా, నేషనల్ యూనియన్ ఆఫ్ మైన్ వర్కర్స్(ఎన్‌యూఎమ్) అసోసియేషన్ ఆఫ్ మైన్ వర్కర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ యూనియన్(ఏఎమ్‌సీయూ) రెండూ కలిసి, ఏకమై దోపిడీదారులను ఒకే శక్తిగా ఎదుర్కొనేం దుకు కృషి చేశాయి. పెరుగుతున్న జీవన వ్యయం,ఇంధన సంక్షోభం, నిరుద్యోగం, పేదరికం, అసమానతలకు వ్యతిరేకంగా 24 ఆగస్టున నిరసనలు తెలపాలని దక్షిణాఫ్రికా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నిర్ణయించింది.

మోదీకి మళ్లీ అవే సమస్యలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం తన సొంతంగా 2,900 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, వీటిని వెంటనే రియంబర్స్ చేయాలని, సవరించిన అంచనాల ప్రకారం టెక్నికల్ అడ్వైజర్ కమిటీ నిర్ధారించిన ప్రాజెక్టు వ్యయం రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. డీబీటీ పద్ధతి ద్వారా భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల కింద నిర్వాసితులకు పరిహారాన్ని అందించాలని, ప్రాజెక్టు నిర్మాణ పనులను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడానికి వీలుగా అడహాక్‌గా రూ.10 వేల కోట్లు ఇవ్వాలని కోరారు. 2014-15 కాలానికి సంబంధించిన బిల్లుల రూపంలో, 10వ వేతన సంఘం బకాయిల రూపంలో, పెన్షన్లు తదితర రూపంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులను మంజూరు చేయాలని కోరారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హుల ఎంపికలో హేతుబద్ధీ కరణ లేకపోవడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని వివరించారు. కోవిడ్ సమయంలో ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద కేంద్రం ఇస్తున్న దానికంటే, కేంద్రం కవర్ చేయని, అదనంగా 56 లక్షల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం వర్తింపు చేసిందని, దీనివల్ల సుమారు 5,527.63 కోట్ల రూపాయల అదనపు భారాన్ని రాష్ట్రం మోయాల్సి వచ్చిందని ప్రధాని దృష్టికి తీసుకొచ్చారు. తెలంగాణ డిస్కంల నుంచి రావాల్సిన రూ.6,756 కోట్ల బకాయిల అంశాన్ని ప్రస్తావిస్తూ, 8 ఏళ్లుగా ఈ సమస్య అపరిష్కృతంగానే ఉందని తెలిపారు. ఈ డబ్బు ఇప్పిస్తే పూర్తిగా కష్టాల్లో ఉన్న రాష్ట్ర విద్యుత్ కంపెనీలు ఒడ్డున పడతాయని, ఉత్పత్తిదారులకు బకాయిలు చెల్లించడానికి మార్గం సుగమమం అవుతుందని వివరించారు. అలాగే పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రత్యేక తరగతి హోదా సహా మిగిలిన పెండింగ్ అంశాల అమలుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 26 జిల్లాలకు కేవలం 11 వైద్య కళాశాలలు మాత్రమే ఉన్నాయని, కొత్తగా మూడు కళాశాలలకు అనుమతి ఇచ్చినందున మరో 12 కళాశాలలకు అనుమతులు మంజూరు చేయాలని, కడపలో ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ కోసం ఏపీఎండీసీకి ఇనుప గనులు కేటాయించాలని, ఏపీఎండీసీకి బీచ్‌శాండ్ మినరల్ ఏరియాలను కేటాయించాలని, ఈ రంగంలో దాదాపు రూ.20 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం ఉందని ప్రధానికి సీఎం వివరించారు.

రాష్ట్రపతితో మర్యాదపూర్వక భేటీ

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. సీఎంతో పాటు వైసీపీ పార్లమెంటరీ నేత విజయసాయి రెడ్డి, లోక్‌సభా వైసీపీ నాయకులు మిథున్ రెడ్డి కూడా ఉన్నారు. అనంతరం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్‌ను కలిసి విద్యుత్ బకాయిల అంశాన్ని పరిష్కరించాల్సిందిగా కోరారు.

కార్మికుల మెడకు ఉరితాడు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశానికి ఇస్తున్న ఆతిథ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయు న్యూ, వైఎస్ఆర్ టీయూ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ, సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శులు కొత్తకోట వెంకటేశ్వర్లు, దామ శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, రవీంద్రనాథ్ ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రులు, లేబర్ అధికారులతో ఈ నెల 25, 26 తేదీల్లో సమావేశం జరుపుతున్నారు. లేబర్ కోడ్లను భారతదేశంలో ఏ విధంగా అమలు చేయాలనే అంశంపై చర్చ చేయనున్నారు. లేబర్ కోడ్లను కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ సుదీర్ఘకాలంగా పోరాడుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ అమలు చేసేందుకే మొగ్గు చూపడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. లేబర్ కోడ్లు అమలులోకి వస్తే పని గంటలు పెరుగుతాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న 8 గంటలకు బదులు 12 నుంచి 16 గంటల వరకు పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంటే 1910-20 ప్రాంతంలో ఏ విధంగా కార్మిక వర్గం పని చేశారో...మళ్లీ ఆ పాత రోజులు గుర్తుకు వచ్చే విధంగా పని గంటలు పెరుగుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకరమైన లేబర్ కోడ్లను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని రవీంద్రనాథ్ హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పీవీఆర్ చౌదరి, ఐయఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్, ఏఐయఫ్ టీయూ (న్యూ) జిల్లా కార్యదర్శి యం.యస్.సాయి మాట్లాడారు. శ్రీరామ శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, టి.మహేశ్, పోకల కోటేశ్వరరావు, నాయుడు, వెంకట్రావు, నారాయణ, బాషా, సీహెచ్. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మూల్యం చెల్లించాల్సిందే: కొండలరావు

విజయవాడ ధర్నాచౌక్ వద్ద కార్మిక సంఘాలు నిర్వహించిన ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కొండలరావు మాట్లాడుతూ లేబర్ కోడ్ల అమలు కోసం మోదీ ప్రభుత్వం చేపట్టే నిరంకుశ విధానాలకు జగన్ సర్కార్ సహకరిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. ఉమామహేశ్వర రావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ 135 సంవత్సరాల క్రితం కార్మికవర్గం సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని నేటి మోదీ ప్రభుత్వం కాలరాచి లేబర్ కోడ్ల ద్వారా 12 గంటల పనిదినాన్ని తీసుకొస్తుందని మండిపడ్డారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు టి.తాతయ్య మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమలైతే పారిశ్రామిక ప్రమాదాల్లో యజమానులకు ఏ బాధ్యతా ఉండదని, కార్మిక / ఫ్యాక్టరీ శాఖల పర్యవేక్షణ ఉండదన్నారు. ఇప్పటికీ కార్మికవర్గంలోని 15 శాతం మంది మాత్రమే కార్మిక సంఘాల నిర్మాణంలో ఉన్నారు. కొత్త కోడ్లు అమలు జరిగితే కార్మిక సంఘాల నిర్మాణం ఆచరణలో అసాధ్యమవుతుందన్నారు. ధర్నాకు అధ్యక్షవర్గంగా సీహెచ్‌వీ రమణ, ఎ.వెంకటేశ్వరరావు ఉండగా ఏఐసీటీయూ నగర నాయకులు పల్లె చినలక్ష్మయ్య, జగుపల్లి శ్రీనివాసరావు, పి.శ్రీను, శ్రీరామచంద్ర మూర్తి, శ్రీనివాసరెడ్డి, రాంబాబు, సీఐటీయూ నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, టీయూసీఐ నాయకులు యం.ప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు రామ కృష్ణ, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌ఏ శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల దిగుమతికి అడ్డాగా గుజరాత్ ఓడరేవులు: కాంగ్రెస్

అహ్మదాబాద్: గుజరాత్‌లో మాదకద్రవ్యాల వ్యాపారానికి అడ్డాగా మారిందని ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శించింది. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో రూ. 2.5 లక్షల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడ్డాయని కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్మన్ సుప్రియా శ్రీనాథ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్రంలో పట్టుబడిన డ్రగ్స్ విలువ రాష్ట్ర బడ్జెట్ కన్నా ఎక్కువని చెప్పారు. రాష్ట్రంలోని ముంద్రా, పిపావావ్ ఓడ రేవులు మాదకద్రవ్యాలను దిగుమతి చేసుకునేందుకు గేట్ వే లుగా మరాయని ఆరోపించారు.

20 కోట్లమంది పిల్లలు

చదువుకు దూరం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బాల కార్మిక వ్యవస్థపై యువతరం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత డాక్టర్ కైలాశ్ సత్యార్థి పిలుపునిచ్చారు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన భారత్‌లో బాల కార్మికుల పరిస్థితి దారుణంగా మారకముందే...ఈ సమస్య పరిష్కారానికి యువత నడుం బిగించాల్సి ఉందని సూచించారు. ఏపీ ఎస్ఆర్ఎం యూని వర్సిటీలో సోమవారం ఉదయం 'భవిష్యత్ తరాల అభివృద్ధికి యువ నాయకత్వం' అన్న అంశంపై జరిగిన సదస్సులో డాక్టర్ కైలాశ్ సత్యార్థి ప్రసంగించారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య వజ్జా సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో కైలాశ్ సత్యార్థి విద్యార్థులకు అనేక సూచనలు చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు జరుగుతున్న తరుణంలో మనం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతి సాధించా మనీ, ఇదే పంథాలో బాలకార్మిక వ్యవస్థపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో పిల్లలపై హింస అనేక రీతులలో కనిపిస్తోందనీ, పిల్లలు అతి తక్కువ ధరకే అమ్మబడుతున్నారనీ, ఈ పరిస్థితి అత్యంత దయనీయంగా కనిపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛ..మనిషి సంతోషకర జీవనానికి దోహదపడుతుందనీ, ఇది లేక కోట్ల సంఖ్యలో బాలలు హింసకు లోనవుతున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 16 కోట్లమంది పిల్లలు స్కూళ్లకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. 20 కోట్ల మంది పిల్లలు దారిద్ర్యం బారిన పడి చదువులకు దూరమయ్యారన్నారు. యువతరం బాలల సంరక్షణ, వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జాతి నిర్మాణానికి, భావి భారత పునర్మిణానికి యువత కంకణబద్ధులు కావాలన్నారు. దశాబ్ద కాలంగా కేంద్ర ప్రభుత్వంతో కలిసి బాలల పురోగతి కోసం తమ ఫౌండేషన్ శ్రమిస్తున్నదన్నారు. అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్య అందిస్తోన్న ఎస్ఆర్ఎం యూనవర్సిటీ నుంచి భవిష్యత్తులో నోబెల్ గ్రహీత ఉద్భవించనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కైలాశ్ సత్యార్థి యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్‌ను అభినందించారు. అనంతరం కైలాశ్ సత్యార్థిని ఆచార్య వజ్జా సాంబశివరావు సత్కరించి బాలాజీ జ్ఞాపికను అందజేశారు. కైలాశ్ సత్యార్థి మరో జ్ఞాపికను సాంబశివరావుకు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ప్రొఫెసర్లు, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కైలాశ్ సత్యార్థి సమాధానాలు ఇచ్చారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమకుమార్ వందన సమర్పణ చేశారు.

విద్యలో నాణ్యత పెరగాలి

విద్యావ్యవస్థకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయ శిక్షణ వంటి వాటికి మనం మరింత పెట్టుబడులు పెట్టి విద్యలో నాణ్యత పెంచాల్సిన అవసరం ఉందని కైలాశ్ సత్యార్థి పునరుద్ఘాటించారు. సదస్సు అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం మరింత కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఇది రాజకీయంగా, ఆర్థికంగా, మౌలిక వసతుల కల్పన రూపంలోనూ ఉండవచ్చున్నారు. ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

ఇక ఆరు పేపర్లే

(మొదటిపేజీ తరువాయి)

నియమించలేదు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో అత్యధికంగా తెలుగుమీడియం బోధిస్తున్న వారే ఉన్నారు. వారికి ఒక్కసారిగా సీబీఎస్ఈ బోధనా బాధ్యతలు అప్పగిస్తే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారు. ఆ ప్రభావం ఉత్తీర్ణతా శాతంపై పడుతుంది. నూతన విద్యా విధానం-2020 పేరుతో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం ద్వారా, ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నాడు-నేడు కింద కోట్లాది రూపాయల నిధులతో ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేసినప్పటికీ, నేడు అవి అలంకారప్రాయంగా మారాయి. అటు ఉన్నత పాఠశాలల్లో కనీస మౌలిక సౌకర్యాల్ని ప్రభుత్వం కల్పించలేదు. సీబీఎస్ఈ బోధనకు అర్హతగల ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరముంది. లేకుంటే ఆదిలోనే ఆటంకాలు ఎదురయ్యే ప్రమాదముందని ఉపాధ్యాయ సంఘాలు సూచిస్తున్నాయి.

నేడు విద్యా సంస్థల బంద్

(మొదటిపేజీ తరువాయి)

పేరుతో, విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయి. ప్రవేశాల పేరుతో అదనపు ఫీజులు గుంజుతున్నాయి. వాటిని నియంత్రించకుండా, జాతీయ విద్యా విధానం తీసుకురావడం ఇంకా విద్య వ్యాపారం వైపు వెళ్లే అవకాశముందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. జగన్ అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో వాటి సమస్యల్ని ఆలకిం చడం లేదనే విమర్శ లున్నాయి. 450 బీసీ హాస్టళ్ల వార్డెన్లు ఖాళీగా ఉన్నప్పటికీ, ఇంతవరకు వాటి భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలతోపాటు వారికి మంచి ఆహారం అందడం లేదు. జగనన్న గోరుముద్ద పేరుకు మాత్రమే పరిమి తమైంది. అటు 24 వేలపాధ్యాయ పోస్టులు ఖాళీలుగా ఉన్నప్పటికీ, వాటిని భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. విశ్వవిద్యాలయాల్లో బోధన/బోధనేతర పోస్టులు భర్తీచేయకుండా, విద్యార్థులకు విద్యనెలా అందిస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. ఏపీపీఎస్సీ ద్వారా ప్రకటించిన ఉద్యోగాల పట్టికను సక్రమంగా నిర్వహించడం లేదు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు నిధుల కేటాయింపును ప్రభుత్వం విస్మరి స్తోంది. ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్షపై విద్యార్థులు ఆస్తి చూపనందున, కోర్సులు ఖాళీ అవుతున్నాయి. జీవో 77 ఉత్తర్వులకు అనుగుణంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్‌షిప్ ఇవ్వలేదు.ఇంటర్మీడియట్ కళాశాలలో సైన్స్ గ్రూపుల్లో ఉపాధ్యాయ లేక విద్యార్థులు తప్పుతున్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలి. విద్యార్థులు బస్సు పాస్ చార్జీలు పెరగడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. కార్పొరేట్ సంస్థయిన, బై జ్యూస్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడాన్ని విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇది విద్యార్థులకు చదువు దూరం చేసే కుట్రలో భాగమేనని ధ్వజమెత్తుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల అవుతున్నప్పటికీ, ఇంతవరకు వారికి పాఠ్యపుస్తకాలు దరిచేరలేదు.

బంద్ విజయవంతం చేయాలి: విద్యార్థి సంఘాల జేఏసీ

కేజీ టు పీజీ వరకు ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23వ తేదీ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి జేఏసీ నేతలు కోరారు. బంద్‌లో విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు పాల్గొనాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రవిచంద్ర, రాంమోహన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్, ఏఐఎస్‌ఏ కార్యదర్శి అనిల్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్, ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర నాయకులు బసవరాజు పిలుపునిచ్చారు. జాతీయ విద్యావిధానం-2020ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల భావోద్వేగ నిరసన

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలో సమస్యల పరిష్కారం కోసం అన్నదాతలు తమ సంప్రదాయ వస్త్రధారణతో భావోద్వేగ నిరసన చేపట్టారు. అనేక సమస్యలపై జంతర్ మంతర్ వద్ద తమ నిరసన ప్రదర్శనను ప్రారంభించిన వేలాది మంది రైతులలో కేరళకు చెందిన 64 ఏళ్ల శ్రీరాజ్ కొడ్యూరివ్ తన 'ఆదివాసి' వేషధారణతో అందరి దృష్టిని ఆకర్షించాడు. కేరళ నుంచి మూడు రోజుల రైలు ప్రయాణం ముగించుకుని కొడ్యూ రివ్ సోమవారం ఢిల్లీ చేరుకున్నాడు. గంటల తరబడి జంతర్ మంతర్ వద్ద 'ఎంఎస్‌పీ అమలు చేయండి, రైతును రక్షించండి' అని రాసి ఉన్న ప్లకార్డులు పట్టుకుని నిలబడ్డారు. 'రైతులు ప్రకృతికి అత్యంత సన్నిహితులు. వారు తమ వ్యవసాయ పరికరాలను వదిలివేస్తే, మనకు ఆహా రం లభించదు. అందువల్ల రైతులను రక్షించాలి. దీని కోసం నేను ఇక్కడ ఉన్నాను' అని కొడియురివ్ అన్నారు. 'ఆదివాసీ' వేషధారణను ఎందుకు ఎంచు కున్నారని అడిగిన ప్రశ్నకు, 'రైతులు, గిరిజన ప్రజలు వారి హక్కులకు అర్హులని సందేశం పంపడానికి ఇది' అని తెలిపారు. పంటలకు కనీస మద్దతు ధర, వ్యవసాయ రుణాల మాఫీ, కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ దేశం నలుమూలల నుంచి రైతులు సోమవారం ఇక్కడ సమావేశమైనందున జంతర్ మంతర్ అసమ్మతి స్వరాలతో హోరెత్తింది. ఉత్తర ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో గత అక్టోబర్‌లో జరిగిన రైతు నిరసన సందర్భంగా నలుగురు రైతుల మీదకు వాహనాన్ని నడిపి హత్య చేసిన కేసులో నిందితుడైన ఆశిష్ మిశ్రా తండ్రి అజయ్ మిశ్రా. జంతర్ మంతర్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర) పిలుపునిచ్చిన 'మహాపంచా యత్'లో భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య వందలాది సంఖ్యలో రైతులు తమ నిరసనను ప్రారంభించారు. జెండాలు చేతబూని, తమ రైతు సంఘాల పేరు రాసి ఉన్న టోపీలు ధరించి, రైతు ఐక్యత కోసం నినాదాలు చేస్తూ, కేంద్రం ఇచ్చిన హామీలు సరిగా లేవని ఆరోపించారు. పంజాబ్‌కు చెందిన మాఘ నిబోరి, ఒక ఎకరం పొలం ఉన్న రైతు. అతను కాలానుగుణ పంటలతో సాగు చేస్తున్నాడు. అవసరమైతే, ఇక్కడే పూర్తిగా ఉండేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పాడు. మహా పంచా యత్‌లో పాల్గొనేందుకు చాలా మంది వేల కిలో మీటర్లు ప్రయాణించారు. 'నేను కొచ్చిన్ నుంచి వచ్చాను. ఎంఎస్‌పీ చట్టం, ఇతర సమస్యలకు సంబంధించి మా డిమాండ్‌లను అంగీకరిం చాలని ప్రధాన మంత్రి మోదీని కోరడానికి కేరళ, సమీప రాష్ట్రాల నుంచి సుమారు 250 మంది వచ్చారు. డబ్ల్యూటీవో నుంచి భారతదేశం వైదొల గాలని మేము కోరుకుంటున్నాము. అజయ్‌మిశ్రా రాజీనామా చేయాలి' అని కేరళలోని కొచ్చిన్‌కు చెందిన 50 ఏళ్ల రైతు పాల్సెన్ అన్నారు. చాలా మంది రైతులు తమదైన రీతిలో తమ నిరసన తెలిపారు. వారిలో ఒకరు వెల్లుల్లి మాల వేసుకుని రాగా, మరో మహిళ త్రివర్ణ పతాకాలతో కూడిన చీర కట్టుకుంది. 'ప్రభుత్వం హామీ ఇచ్చింది కానీ ఇప్పుడు ఏమీ చేయడం లేదు.. ప్రభుత్వం తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలు లేవు. ఒక వ్యక్తిని అధికారం లోకి తీసుకురాగలిగితే.. మనం కూడా దించగలం.. ఈ విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి' అని త్రివర్ణ చీర ధరించిన కవిత అన్నారు. వివిధ సంఘాలతో సంబంధమున్న రైతులు ఢిల్లీకి చేరుకున్నప్పుడు, పోలీసులు నిరసన ప్రదేశానికి వెళ్లే మార్గాన్ని అడ్డుకున్నారు. నగరం ప్రవేశం పాయింట్ల మీదుగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. దేశ రాజధానిలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉత్తర భారతదేశం కాకుండా, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, కేరళ వంటి రాష్ట్రాల నుంచి రైతులు 'మహాపంచాయత్'లో పాల్గొనడానికి ఢిల్లీకి వచ్చారు.

కాషాయం రంకెలు...

(మొదటిపేజీ తరువాయి)

చెప్పాలంటే, ఈ దర్గాకు మైసూర్ రాజ్యం, తరువాత బ్రిటిష్ వారు నిధులు అందించారని సూచిస్తున్నాయి. బ్రిటీష్ చరిత్రకారులు, మైసూర్ ప్రభుత్వ రికార్డులు... స్వాతంత్ర్యానికి ముందు ఈ దర్గాను ఇస్లామిక్ విశ్వాసానికి చెందిన షా ఖాద్రీ, అతని కుటుంబం నిర్వహించినట్లు సూచిస్తున్నాయి. స్వాతంత్ర్యానంతర కాలంలో, 1970వ దశకం చివరిలో వక్ఫ్ బోర్డును ఏర్పాటు చేసి, వక్ఫ్ ఆస్తులను నమోదు చేసి బదిలీ చేసినప్పుడు, మొదటిసారిగా దర్గా చుట్టూ వివాదం చెలరేగింది. హిందూ భక్తులు, షా ఖాద్రీ స్వయంగా ఆలయ నిర్వహణను వక్ఫ్ బోర్డుకు బదిలీ చేయడానికి నిరాకరించారు. బోర్డు దానిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించింది. తరువాతి దశాబ్దాలలో సాగిన సుదీర్ఘమైన, గందరగోళ న్యాయ పోరాటంలో వక్ఫ్ బోర్డుకు దాని బదిలీని హైకోర్టు, సుప్రీం కోర్టు రద్దు చేశాయి. దర్గా, షా ఖాద్రీ పరిపాలన, మతపరమైన అధికారం కూడా. ఇస్లామిక్ విశ్వాసం అన్ని స్థాయిలలో సమర్థించబడింది. హిందూ భక్తులు కూడా ఈ మందిరంలో తమ అడ్డంకిలేని ప్రవేశం, ప్రార్థన హక్కును మాత్రమే డిమాండ్ చేశారు. 1990ల చివరి వరకు హిందూ పూజా పద్ధతులను లేదా హిందూ అర్చకుల నియామకాన్ని డిమాండ్ చేయలేదు లేదా దానిని దేవాలయంగా ప్రకటించలేదు.

రెచ్చిపోయిన కాషాయ మూకలు

కానీ 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత, 2002 గుజరాత్ మారణ హోమం తర్వాత దర్గా చుట్టూ వివాదం సృష్టించేందుకు హిందుత్వ సంస్థలు ఉబలాటపడ్డాయి. 1990వ దశకం చివరి నాటికి, భజరంగ్ దళ్, బీజేపీ ఏటా దర్గాలో ఏటా నిర్వహించే సాంప్రదాయ ఉర్సులకు ప్రతిగా దత్త జయంతి, దత్త మాలలను పాటించడం ప్రారంభించాయి. టిప్పు సుల్తాన్ మద్దతుతో ముస్లింలు ఆక్రమించుకున్న ఈ మందిరం దత్తాత్రేయ దేవాలయం అని హిందుత్వ కథనం అబద్ధాన్ని ప్రచారం చేసింది. ఆ విధంగా 2002 తర్వాత అయోధ్య తరహాలో దత్త దేవస్థానాన్ని 'విముక్తి' చేయాలనే నయా మతోన్మాద నినాదాన్ని ఎత్తుకున్నాయి. మరోవైపు, 2003లో ఇంతవరకు తెలియని 'శ్రీ గురు దత్తాత్రేయ సంవర్ధన సమితి' అనే సంస్థ ఒక పనికిమాలిన రిట్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ మందిరంలో హిందువుల ఆగమ పద్ధతులలో హిందూ అర్చన జరిగిందని, టిప్పు సుల్తాన్ కాలంలో దర్గాగా మార్చబడిందని వాదించారు. అందుకే షా ఖాద్రీ అధ్వర్యంలో పూజాదికాలు నిర్వహిస్తున్న ముజావర్‌ను తొలగించి హిందూ అర్చకుని నియమించాలని పిటిషన్‌లో కోరారు. ప్రార్థనా స్థలాల చట్టం, 1991ని తగ్గించి ఈ పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు అనుమతించింది. టిప్పు సుల్తాన్ పాలనకు ముందు ఈ మందిరం ఆలయమా కాదా అని నిర్ధారించుకోవడానికి బహిరంగ విచారణను నిర్వహించాలని హిందూ ధర్మాదాయ, మతపరమైన ఎండోమెంట్స్ కమిషనర్‌ను కోర్టు కోరింది. పిటిషన్‌లోని అంశాలు నిజమని రుజువైతే హిందూ అర్చకుడిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపింది. అయితే దీనిని వివిధ లౌకిక సంస్థలు 2008లో సుప్రీం కోర్టులో సవాలు చేశాయి. ఇది యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. అయితే బహిరంగ విచారణలను కొనసాగించడానికి అనుమతించింది.

నివేదికను దాని సిఫార్సులతో సుప్రీం కోర్టుకు సమర్పించింది. దీని ప్రకారం, బహిరంగ విచారణ నిర్వహించి, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎన్.వి.రమణలతో కూడిన ధర్మాసనానికి సీల్డ్ కవర్‌లో నివేదికను సుప్రీం కోర్టుకు సమర్పించారు. 2015లో తెరిచిన నివేదికలో ఈ మందిరం అన్ని వేళలా దర్గాగా ఉందని తెలిపే ఎలాంటి ఆధారాలు, రికార్డులను పరిగణనలోకి తీసుకోలేదు. దీనికి విరుద్ధంగా, కమిషనర్ పూర్తిగా హిందూ భక్తులు, వారి విశ్వాసం మౌఖిక నిరాకరణపై ఆధారపడ్డారు. మందిరంలో ఒక హిందూ అర్చకుడు, హిందూ పూజా విధానాలను నియమించాలని గట్టిగా సిఫార్సు చేశారు. కమిషనర్ సిఫార్సులు అమలు చేయబడితే, ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఉల్లంఘించే అవకాశం ఉన్నందున, 'తగిన చర్యలు' తీసుకోవాలని సుప్రీం కోర్టు స్వయంగా ఏ ఉత్తర్వును జారీ చేయలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచన పంపింది. సిద్ధరామయ్య నేతృత్వంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత పక్షాలన్నింటి వాదనలు వినడానికి, ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలను సిఫార్సు చేయడానికి విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి హెచ్ఎన్ నాగమోహన్ దాస్ అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. టిప్పు సుల్తాన్ కాలంలో పుణ్యక్షేత్రం 'మార్పిడి' జరిగినట్లు రుజువు చేయడంలో హిందూవులు ఎలాంటి సాక్ష్యాలను అందించడంలో విఫలమైనందున, దర్గా సమకాలీకరణ స్వభావం యథాతథ స్థితిని కొనసాగించాలని కమిటీ చివరికి సిఫార్సు చేసింది. హిందూ అర్చక, హిందూ ఆగమ పూజా విధానాల నియామకం మందిరం మతపరమైన స్వభావాన్ని మారుస్తుందని, అందువల్ల ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఉల్లంఘిస్తుందని కూడా ఇది విశ్వసించింది. ప్రభుత్వం జస్టిస్ దాస్ సిఫార్సులను ఆమోదించింది. యథాతథ స్థితిని కొనసాగించడానికి మార్చి 2018లో ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం 'మైనారిటీలను మభ్యపెడుతోందని' ఆరోపిస్తూ బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులను హిందూత్వ సంస్థలు హైకోర్టులో సవాలు చేయడంతో ఆ ఉత్తర్వులపై స్టే విధించింది. ఇదిలాఉండగా, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వం తరపు న్యాయవాది మందిరంలో హిందూ అర్చకుడిని నియమించాలనే డిమాండ్‌ను పునరుద్ధరించారు. 2021 సెప్టెంబరులో హైకోర్టు తన ఉత్తర్వును ఇచ్చింది. హిందూ భక్తులు చేసిన ఆక్షేపణలను పూర్తిగా సమర్థిస్తూ, భౌతిక సాక్ష్యాలపై మెజారిటీ విశ్వాసానికి ప్రాధాన్యతనిచ్చిన సుప్రీం కోర్టు అయోధ్య తీర్పు నుంచి దాని స్ఫూర్తిని పొందింది. పూజా మందిరానికి ప్రార్థనా స్థలాల చట్టం వర్తించడాన్ని పూర్తిగా తిరస్కరించే స్థాయికి కూడా వెళ్లింది. అయితే మరోసారి బహిరంగ విచారణ నిర్వహించి, ఆపై హిందూ అర్చకుని నియమించాలని కూడా కోర్టు ప్రభుత్వాన్ని కోరింది. బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం 2022 ఆగస్టు 18న (రెండు బహిరంగ విచారణల తర్వాత) అన్ని పాలనా, మతపరమైన కార్యకలాపాలను నియంత్రించడానికి, పర్యవేక్షించడానికి, మార్గనిర్దేశం చేయడానికి ఒక పరిపాలనా కమిటీని ఏర్పాటు చేయడానికి ఒక ఉత్తర్వును ఆమోదించింది. అటువంటి ఉత్తర్వు ప్రభావవంతంగా దర్గా వంశపారంపర్య అధిపతి అయిన షా ఖాద్రీని పుణ్యక్షేత్రం అన్ని అధికారం, బాధ్యతల నుంచి మినహాయించడం. ఇది పిటిషనర్లు కోరుకున్న దానికంటే ఎక్కువ. భారతదేశంలో ఎక్కడైనా ఇటువంటి వ్యాజ్యాలన్నింటిలో బీజేపీ, సంఘ్ పరివార్ ఏదైనా ప్రజాస్వామ్య ప్రక్రియలపై సాంప్రదాయ, వంశపారంపర్య, ఆచార హక్కులను నొక్కి చెబుతాయి. తద్వారా హిందూ హక్కులు హిందువేతరుల సంప్రదాయాలను అరికట్టడానికి మాత్రమే ప్రజాస్వామ్య ప్రమాణాలను సూచిస్తాయని మరోసారి రుజువు చేసింది. ఈ ఉత్తర్వు రోజువారీ ఆచారాలను నిర్వహించడానికి అర్హత కలిగిన హిందూ అర్చక, ముజావర్‌ల నియామకానికి అధికారం ఇస్తుంది. అన్ని దర్గాలలో, ప్రపంచంలో ఎక్కడైనా, ముజావర్‌ను సంబంధిత మందిరంలోని షా ఖాద్రీ నియమిస్తారు.

అయితే ప్రస్తుత ఆర్డర్ ముజావర్‌కు మతపరమైన విషయాలపై కూడా మార్గనిర్దేశం చేయడానికి కమిటీకి అధికారం ఇస్తుంది. 1990వ దశకం చివరిలో హిందూత్వ సంస్థలు కొత్తగా, దురుద్దేశంతో ప్రవేశపెట్టిన దత్త జయంతి, దత్త మాల వేడుకలకు ఈ ఉత్తర్వు అధికారిక హోదాను ఇచ్చింది. ఈ కమిటీ ఇతర హిందూ ఆచారాలను సులభతరం చేస్తుందని, మందిరాన్ని మరింత హైందవీకరించే అవకాశాన్ని తెరుస్తుందని ఆర్డర్ చెబుతోంది. వార్షిక ఉర్సు కూడా హిందూ క్యాలెండర్ ప్రకారం మాత్రమే నిర్వహించాలని పేర్కొంటోంది. భవిష్యత్తులో దర్గాను క్రమంగా హిందూ దేవాలయంగా మార్చేందుకు హిందూత్వ సంస్థల కోసం ఈ క్రమంలో విశాలమైన రహదారిని నిర్మించారు.

ఈ దర్గా కర్ణాటక సమకాలీన సంస్కృతికి ప్రతీక. ఆ విశ్వాసానే కూల్చివేయడంలో కాషాయ శక్తులతో పరిపాలనా వ్యవస్థ కుమ్మక్కు కావడం ఆధునిక భారత చరిత్రలో చీకటి అంకాలలో ఒకటిగా నిలిచిపోతుంది.

బిసెంట్ యూనివర్సిటీ సాధనకు

మలిదశ ఉద్యమం

బీటీ కళాశాలను కాపాడడంలో ఏఐఎస్ఎఫ్ పోరాటం చారిత్రాత్మకం

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

జెండాను ఆవిష్కరిస్తున్న నారాయణ

విశాలాంధ్ర - మదనపల్లె : మదనపల్లిలోని బిసెంట్ దివ్యజ్ఞాన కళాశాల (బీటీ కాలేజ్)ను కాపాడుకోవడంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) చేసిన పోరాటం చారిత్రాత్మకమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. చారిత్రాత్మకమైన ఈ కళాశాలను ప్రభుత్వంలో విలీనం చేస్తూ జీవో విడుదల చేయడంతో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో విజయోత్సవ సభను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కె.నారాయణ ముందుగా కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఐర్లాండ్ దేశానికి చెందిన వనిత అనిబిసెంట్ బీటీ కళాశాలను 1913లో ప్రారంభించారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య పోరాటాలకు ఈ కళాశాల నాంది పలికిందన్నారు. అనేకమంది రాజకీయ నాయకులు ఇక్కడ చదువుకున్నారని తెలిపారు. వారిలో తాను కూడా ఒక్కడినని తెలిపారు. కళాశాల ఆస్తులు పక్కదారి పట్టకుండా ఏఐఎస్ఎఫ్ నేతృత్వంలో కళాశాల విద్యార్థులు 282 రోజులు ఉద్యమం చేపట్టి, రాజకీయ కుట్రలను ఛేదించి ప్రభుత్వంలో విలీనం అయ్యేలా పోరాడి విజయం సాధించారని కొనియాడారు. విద్య ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఈ కళాశాలను యూనివర్సిటీగా మార్చేందుకు మలిదశ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన బీటీ కళాశాలను కాపాడుకోవడంలో ఏఐఎస్ఎఫ్, కళాశాల విద్యార్థులు, సీపీఐ చేసిన పోరాటం అజరామరమన్నారు. దక్షిణ భారత దేశంలోని త్రిలోకేకర్ హాకీ టోర్నమెంట్ నిర్వహించిన ఘనత ఈ కళాశాలకే దక్కుతుందన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన మాట్లాడుతూ బీటీ కళాశాల రక్షణ పోరాటంలో విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్, సీపీఐ నేతలు సరికొత్త ఒరవడిని సృష్టించారన్నారు.

భవిష్యత్తులో బీటీ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చేలా కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అన్నమయ్య జిల్లాలో విశ్వవిద్యాలయం లేదని బీటీ కళాశాలకు వర్సిటీకి కావలసిని అన్ని హంగులు ఉన్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శివారెడ్డి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా విశ్వనాథ్, సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.క్రిష్ణప్ప, నేతలు ఆర్‌జె. వెంకటేశ్, శ్రీరామినేని జయరామ నాయుడు, నరేంద్ర బాబు, గిరిజన సంఘం విశ్వనాథ్ నాయక్, పీలేరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి వెంకటేశ్, కోటి, కోన భాస్కర్, సేగు రెడ్డెప్ప రెడ్డి, ఏఐటీయూసీ నేత సాంబశివ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నేత శశికుమార్, నవీన్ కుమార్, మాధవ్, బ్రహ్మయ్య, అశోక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా పెద్ద నేరస్థుడు : నారాయణ

తెలంగాణ బీజేపీ నేతలపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పెద్ద నేరస్థుడని పేర్కొన్నారు. ఆయన చెప్పులు మోసే బీజేపీ నేతలు తమను విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. మీ బతుకేందో తమకు ఇప్పుడు అర్థమైందని పేర్కొన్నారు. హోంమంత్రి పెద్ద క్రిమినల్...ఆయనపై నమోదైన ఒక కేసులో 12 మంది సాక్షులను, లాయర్లను హత్య చేయించి నిర్దోషి అనిపించుకున్నారని సోమవారం మీడియాకు విడుదల చేసిన వీడియోలో ఆరోపించారు. అటువంటి నేరస్థుడు దురదృష్టవశాత్తు దేశానికి హోంమంత్రి అయ్యారని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తి చెప్పులు మోస్తూ తెలంగాణ బీజేపీ నేతలు చప్రాసీ పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీని ఓడించడానికి దెయ్యంతోనైనా కలిసి పని చేస్తాం. కేసీఆర్‌తోనైనా.. ఇంకెవరితోనైనా కలుస్తామని తేల్చి చెప్పారు. బీజేపీని ఓడించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తామని బానిసబుద్ధితో చెప్పులు మోసుకుంటూ తిరగండి తప్ప.. మీ శక్తికి మించి మాట్లాడకండంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వియత్నాం పర్యటనలో ఇస్కఫ్ ఏపీ బృందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వియత్నాం యూనియన్ ఆఫ్ ఫ్రెండ్ షిప్ ఆర్గనైజేషన్ (వీయూఎఫ్ఓ) ఆహ్వానం మేరకు భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) 14 మంది ప్రతినిధుల బృందం సోమవారం రాత్రి కోల్‌కతా విమానాశ్రయం నుంచి వియత్నాం పయనమ్యారు. వారికి ఇస్కఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్‌కుమార్ పడిహారి వీడ్కోలు పలికారు. తొలుత మధ్యాహ్నాం విశాఖ నుంచి కోల్‌కతా ప్రయాణమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు బృందానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీఎస్ సుకుమారన్, రాష్ట్ర కార్యదర్శి మల్లా మాధవరావు వీడ్కోలు పలికారు. రెండు దేశాల స్నేహ సంఘాల మధ్య ఒప్పందం మేరకు వారం రోజుల పాటు పర్యటించి ఆ దేశ శాంతి స్నేహ సంబంధాలు, సంస్కృతీసాంప్రదాయాలు, పర్యావరణ పరిరక్షణపై అధ్యయనం చేస్తారు. ఏపీ బృందంలో అనకాపల్లి నుంచి వై.శివరామకృష్ణ, వై.మాలతి, మర్ల పార్వతి, విజయవాడ నుంచి మోతుకూరి అభ్యుదయ, విశాఖ నుంచి పి.సత్యారావు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై చులకన భావం వద్దు: డీహెచ్‌పీఎస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంక్షేమ పథకాలను ఉచితాలని, తాయులా లని హేళన, చులకన భావాన్ని కలిగించడాన్ని నిరసిస్తూ, విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 25వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) అధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలకు, సామాజిక అసమానతలకు, వివక్షతలకు గురవుతున్న ప్రజల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఒక పథకం ప్రకారం పేదల వ్యతిరేక శక్తులన్నీ.. ఉచిత పథకాలు, పప్పు బెల్లాలు, తాయి లాలుగా అభ్యంతరకర ప్రచారం చేయడాన్ని డీహెచ్‌పీఎస్ తీవ్రంగా వ్యతిరేకి స్తోందన్నారు. తగిన ఆదాయాలు లేక, కుటుంబాలు పోషించుకునే స్థోమతలేని వర్గాలకు, ప్రజలకు మౌలిక సదుపాయాలు, విద్యా, వైద్యం, తాగునీరు, నివాసం కల్పించడం వ్యవసాయ, ఉద్యోగ, ఉపాధి సౌకర్యాల కల్పించడం పాలకవర్గాల కనీస బాధ్యతని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అవహేళన చేసే శక్తుల చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ చర్చావేదిక నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. దీనికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, వివిధ దళిత, ప్రజా సంఘాల నేతలు హాజరవుతారన్నారు. దీనినే సంఘాల నేతలు ఆహ్వా నంగా భావించి చర్చావేదికలో పాల్గొని, తమ అభిప్రాయాలు తెలపాలని కోరారు.

28లోగా వినతుల ప్రక్రియ పూర్తి చేయాలి

ఆర్టీసీ జేఏసీ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగుల సమస్యలు, యాజమాన్య వైఖరిని సీఎం జగన్ దృష్టికి కలెక్టర్ల ద్వారా తీసుకెళ్లేలా వినతుల ప్రక్రియను ఈ నెల 28లోగా పూర్తి చేయాలని ఆర్టీసీ జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు వై.శ్రీనివాసరావు, పలిశెట్ట దామోదరరావు, కో-కన్వీనర్లు సిహెచ్.సుందరయ్య, వైఎస్‌రావు, ఎస్ఎంయూఏ/ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పీవీ రమణారెడి, వైవీ రామరావు ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘ నేతలు మాట్లాడుతూ, పాత పెన్షన్, ఆశించిన మేర జీతభత్యాలు రాలేదని, ప్రయోజనాలు, సౌకర్యాలు కల్పించనందున ఉద్యోగులు నష్టపోతున్నారని స్పష్టం చేశారు. వీటిపై ప్రశ్నిస్తే యాజమాన్యం, ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంభిస్తోందన్నారు. యాజమాన్య నిర్ణయాలతో ఉద్యోగుల్లో అసంతృప్తి పెరిగిపోయిందనీ, ఉద్యమం వైపునకు నెట్టేలా వ్యవహ రిస్తోందన్నారు. సంతకాల సేకరణ పూర్తయిన వెంటనే సీఎం జగన్‌కు కలెక్టర్ల ద్వారా ఉద్యోగులంతా ఒకేసారి వినతులు పంపేలా తేదీని ఖరారు చేస్తామన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి జేఏసీ సమావేశం ఏర్పాటు చేసి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని నేతలు పేర్కొన్నారు.

పవన్‌కు డీల్... ప్యాకేజీ పక్కా

జనసేన కాదు... 'నారా-నాదెండ్ల' సేన

మంత్రులు శంకరనారాయణ, దాడిశెట్టి, ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేన నాయకుడు పవన్ కల్యాణ్‌కు డీల్ కుదిరిందని, ప్యాకేజీ పక్కాగా అమలైందని మంత్రులు శంకరనారాయణ, దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ధ్వజమెత్తారు. వేర్వేరుగా సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, అది జనసేన కాదు... నారా-నాదెండ్ల సేన అని, పవన్‌కు మంగళగిరిలో వేరే కార్యాలయం ఎందుకనీ, అక్కడే టీడీపీ కార్యాలయం ఉంది కదా? అని ఎద్దేవా చేశారు. రాజకీయ కరవు బాధితుడు పవన్‌కు ప్రత్యేక ప్యాకేజీలు అందాయని ఆరోపించారు. టీడీపీలో దుష్టచతుష్టయం-పవన్ కడుపు నిండగా, జనం కడుపు ఎండిందన్నారు. ప్రతి నమస్కారంతోపాటు ప్రతి ఒక్కరికీ మంచి చేసే సంస్కారం సీఎం జగన్‌కే సొంతమని స్పష్టం చేశారు. పవన్‌ను చిరంజీవికి తమ్ముడు అనాలా? చంద్రబాబుకు దత్తపుత్రుడు అనాలా? అని ప్రశ్నించారు. ఇంతకీ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు కోసం పోటీ చేస్తున్నావా? లేక నీ కోసం పోటీ చేస్తున్నావా? అంటూ వారు నిలదీశారు. 175కు 175 ఎమ్మెల్యే సీట్లలో, 25కు 25 లోక్‌సభ సీట్లలో జనసేన పార్టీకి బీ-ఫామ్ మీద అభ్యర్థులను నిలబెట్టే దమ్ముందా? అని సవాల్ విసిరారు. తననుకాక, మరో సినీ నటుడ్ని అమిత్ షా కలవడంతోనే రాయలసీమపై పవన్‌కు ఉన్నట్టు ఉండి మమకారం పుట్టేసిందన్నారు.

సాంస్కృతిక పునరుజ్జీవనం అవశ్యం

ప్రజానాట్యమండలి శిక్షణ శిబిరం ముగింపులో ముప్పాళ్ల

మాట్లాడుతున్న ముప్పాళ్ల. వేదికపై జంగాల, పెంచలయ్య, చంద్రానాయక్, మాల్యాద్రి, గని, పిచ్చయ్య తదితరులు

విశాలాంధ్ర-గుంటూరు: సమాజంలో మార్పునకు సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం రావాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు అన్నారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి పాటల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరయ్యారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముప్పాళ్ల మాట్లాడుతూ చట్టసభలలో రౌడీమూకలు, జేబుదొంగలు, అసాంఘిక శక్తులు చొరబడి దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయని మండిపడ్డారు. 70 శాతం మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు నేరచరితులుగా ఉన్నారని వివరించారు. ఈ పరిస్థితి నుంచి దేశాన్ని కాపాడటానికి దేశభక్తులు, లౌకికవాదులు మేల్కొనాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. బీజేపీ, దాని అనుబంధ సంస్థలు పార్లమెంటరీ వ్యవస్థను నాశనం చేస్తున్నాయని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో విజయవాడలో అక్టోబరులో సీపీఐ 24వ జాతీయ మహాసభలు జరుగుతున్నాయన్నారు. మహాసభల్లో కళాకారులు ఆట, పాట, మాటతో ప్రజల్ని చైతన్యం చేయాలన్నారు. పాటలకు తోడు నృత్య రూపకాన్ని జోడించి కొత్తకొత్త వేషధారణతో కొత్త కళారూపాలను ప్రదర్శించాలని సూచించారు. జాతీయ మహాసభల ప్రచార దళాలను ఏర్పాటు చేసుకుని ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తా ప్రాంతాలలో పర్యటించాలని కోరారు. కమ్యూనిస్టులు బలపడినప్పుడే పేదలకు, శ్రామికవర్గానికి రక్షణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో మా భూమి, భూ బాగోతం, అందరూ బతకాలి, రక్తకన్నీరు వంటి నృత్య రూపకాలతో ప్రజానాట్యమండలి రాష్ట్రాన్ని ఊపేసిందని గుర్తుచేశారు. ప్రజానాట్యమండలి ప్రతిభ ముందు బయటి కళాకారులు సరిపోరన్నారు. మరణం లేని మనిషి కళాకారుడు మాత్రమేనని చెప్పారు. శిక్షణ తరగతుల్లో క్రమశిక్షణగా పాటలు నేర్చుకోవడం అభినందనీయమని, అయితే కళాకారులు మరింత నైపుణ్యత తెచ్చుకోవడానికి ఇది సరిపోదని, జిల్లాస్థాయి శిక్షణ శిబిరాలు కూడా జరగాలని సూచించారు. అందులో ప్రధానంగా జిల్లాకొక నాటక దళం, నియోజక వర్గానికి ఒక ఆటల దళాన్ని ఏర్పాటు చేసుకోవలసిన బాధ్యత ప్రజానాట్యమండలిపై ఉందన్నారు. కొత్త పాటలకు అద్భుత బాణీలతో కళాకారులకు పాటలు నేర్పించిన గని, చంద్రానాయక్, పెంచలయ్యకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రానాయక్, చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి పాటల శిక్షణా శిబిరం నిర్వహణకు ముందుకు వచ్చిన జంగాల అజయ్ కుమార్‌కు, సీపీఐ జిల్లా సమితికి కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, ఆరేటి రామారావు, వి.నాగరాజు, మహేంద్ర, పున్నయ్య, జె.నాగరాజు, డప్పు వాయిద్యకారుడు సూరి, పున్నయ్య, కిన్నెర, వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు ఆపండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజలపై అదనపు భారాలు మోపే విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలను విద్యుత్ రెగ్యులేటరీ బోర్డు (విద్యుత్ నియంత్రణ మండలి) తిరస్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయాన్ని తక్షణం ఆంధ్రప్రదేశ్‌కు మార్చాలన్నారు. 2021-22 జనవరి నుంచి మార్చి వరకు వినియోగించిన విద్యుత్‌కు ఫ్యూయెల్, పవర్ పర్చేజ్ కాస్ట్ మేనేజిమెంట్ (ఎఫ్‌పీపీసీఏ) ప్రతిపాదనలపై బహిరంగ విచారణ సెప్టెంబర్ 7న హైదరాబాద్‌లో జరుపనున్నట్లు విద్యుత్ నియంత్రణ మండలి ప్రకటించిందన్నారు. రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లు అవుతున్నప్పటికీ, మండలి కార్యాలయాన్ని ఇంకా హైదరాబాద్ లోనే కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ట్రూఅప్ చార్జీల భారాన్ని ఏదో ఒక రూపంలో ప్రజలపై మోపేందుకు నూతన మార్గాలను అన్వేషిస్తున్నాయని విమర్శించారు. శ్లాబులు మార్చడం, రాయితీలకు కోత విధించడం చాలక గతంలో వినియోగించిన విద్యుత్‌కు పదేపదే అదనపు చార్జీలు విధించడం పరిపాటిగా మారిపోయిందన్నారు. ప్రజల్ని నిలువునా దోపిడీ చేసే ఇలాంటి విధానాలను విద్యుత్ నియంత్రణ మండలి నివారించాలని, ఎఫ్‌పీపీసీఏ నూతన ప్రతిపాదనలను తిరస్కరించాలని కోరారు.

'పోలవరం' జాప్యానికి టీడీపీనే కారణం: అంబటి

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : పోలవరం ప్రాజెక్ట్ జాప్యానికి గత ప్రభుత్వం చేసిన చారిత్రాత్మక తప్పిదమే కారణమని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. భూగర్భ జల ఆడిట్ శాఖ రూ.2.15 కోట్లతో జాతీయ హైడ్రాలోజి ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించిన జిల్లా డేటా కేంద్రాన్ని సోమవారం ఏలూరులో మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎం జగన్ సూచించిన మేరకు ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా శంకుస్థాపనలకే పరిమితమైన పోలవరం నిర్మాణానికి అసలు పనులు ప్రారంభించింది స్వర్గీయ రాజశేఖరరెడ్డి అన్నారు. వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి జలాలను ఒడిసిపట్టి జలయజ్ఞం ద్వారా ప్రతీ నీటి బొట్టును సాగు, తాగునీటికి ఉపయోగపడేలా కృషి చేశారన్నారు.

కేంద్రం చేపట్టవలసిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను, తామే నిర్మిస్తామని... 2018లోగా పూర్తి చేస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేక పోయిందో చెప్పాలంటూ చంద్రబాబును ప్రశ్నించారు. కాఫర్ డ్యామ్ నిర్మాణం పూర్తి కాకుండా డయాఫ్రమ్ వాల్ నిర్మాణం చేపట్టడం గత ప్రభుత్వం చేసిన చారిత్రాత్మక తప్పిదమని, మేధావి అయిన చంద్రబాబు ఎందుకు చేయవలసివచ్చిందో చెప్పాలన్నారు. దీనికారణంగానే డయాఫ్రమ్ వాల్ దెబ్బ దిన్నదన్నారు. అది ఏమేరకు దెబ్బదిన్నది అనే విషయాన్ని నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ పరిశీలిస్తుందనీ, ఈలోగా భారీ వర్షాలు, వరదల కారణంగా లోయర్ కాఫర్ డ్యామ్ పూర్తి కాలేదన్నారు. దీనికి ప్రాథమిక కారణం గత ప్రభుత్వం కాఫర్ డ్యామ్ నిర్మించకుండా డయాఫ్రమ్ వాల్ నిర్మించడ మేనన్నారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఆర్డీఓ పెంచల్ కిశోర్, తహసీల్దార్ సోమశేఖర్, ఎన్‌జీవో నేతలు చోడగిరి శ్రీనివాస్, హరనాథ్, జలవనరులు, భూగర్భ జల శాఖ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

కేబినెట్ అజెండాలో

గ్రంథాలయ ఉద్యోగుల పదవీ విరమణ పెంపు ఫైల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగులకు పదవీ విరమణ పెంపునకు సంబంధించిన అంశం ఈనెల 29వ తేదీ జరుగనున్న మంత్రివర్గ సమావేశం అజెండాలో చేర్చినట్లు ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు కాకర్ల. వెంకట్రామిరెడ్డి, గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కళ్లేపల్లి మధుసూదన్ రాజు, కృష్ణా జిల్లా సంఘం అధ్యక్షులు భీరం వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 22 నుంచి నేటి వరకు సుమారు 40 మంది ఉద్యోగులు రిటైర్మెంట్ అయ్యారని, వారంతా జీవో రాకపోవడం పట్ల ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గ్రంథాలయ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంపు అంశం మంత్రివర్గం ఆమోదం పొంది, త్వరలోనే ఉత్తర్వులు విడుదలవుతాయని, ఉద్యోగులు ఎవరూ ఆందోళన చెందవద్దని వారు తెలిపారు.

ఈఏపీసెట్ వెబ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, వ్యవసాయ, ఔషధ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్)-2022 కౌన్సెలింగ్‌లో భాగంగా ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు సోమవారం నుంచి వెబ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తారు. కౌన్సెలింగ్ రుసుం, రిజిస్ట్రేషన్లకు ఈనెల 30 వరకు గడువు విధించారు. 23 నుంచి 31 వరకు ఆన్‌లైన్లో అభ్యర్థుల అర్హత ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. సెప్టెంబరు 2 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుంది. 3న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తారు. 6న అభ్యర్థులు ఎంచుకున్న ప్రాధాన్యత ఆధారంగా ఇంజినీరింగ్ సీట్లను ఖరారు చేస్తారు. 6 నుంచి 12 వరకు సీట్లు పొందిన అభ్యర్థులంతా, ఆయా కళాశాలల్లో వ్యక్తిగతంగా నివేదిక ఇవ్వాలి. 12 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. కౌన్సెలింగ్ ఫీజు ఓసీ, బీసీలకు రూ.1200, ఎస్సీ, ఎస్టీలకు రూ.600. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి వివరాలను ఎ్ప్షవ.ఖజూ.గ్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి రాష్ట్ర వ్యాప్తంగా కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్సీ అనంతబాబుకు 3 రోజుల బెయిల్

విశాలాంధ్ర - కాకినాడ: దళిత యువకుడు, తన మాజీ డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యాన్ని అతి కిరాతకంగా హత్య చేసి, డోర్ డెలివరీ చేసిన అధికార పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబుకు షరతులతో కూడిన మూడు రోజుల బెయిల్‌ను ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం మంజూరు చేసింది. మూడో బెయిల్ అప్లికేషన్ పెండింగ్‌లో ఉండగా తల్లి మరణించడంతో ఆమె దహన సంస్కారాలు చేయటానికి తనకు మధ్యస్థ బెయిల్ ఇవ్వాలని కోరుతూ వేసిన పిటిషన్‌పై సోమవారం వాద, ప్రతివాదనలు జరిగాయి. నిందితుడి తరుపు న్యాయవాది రెండు వారాలపాటు మధ్యస్థ బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. బాధితుల తరఫున వాదించిన న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావు తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేయడానికి వీల్లేదని న్యాయస్థానాన్ని కోరారు. నిందితుడికి మధ్యస్థ బెయిల్ ఇస్తే బాధిత కుటుంబానికి ప్రాణాపాయం ఉన్నదని, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు. ఇంకా ఈ కేసులో మరి కొంతమంది నిందితులను గుర్తించవలసి ఉందన్నారు. అతడు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ కాబట్టి మిగిలిన సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశాలు ఉన్నాయని వాదించారు. నిందితుడు ఇతర ప్రాంతాలు తిరగకుండా ఇంటిలోనే ఉంటూ దహన సంస్కారాలకు మాత్రమే బయటకు వెళ్లే విధంగా నిబంధనలు పెట్టాలన్నారు. ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని బెదిరించడం ద్వారా గాని, ప్రభావాలకు లోనుచేయడం ద్వారా కానీ సాక్షులను బెదిరించకుండా, మధ్యస్థంగా బెయిల్ రూపేణా ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా నిబంధనలతో కూడిన ఆదేశాలు ఇవ్వాలన్నారు. అది కూడా... మూడు రోజులు సరిపోతుందని ముప్పాళ్ళ వాదించారు. నిందితుడి తరపు న్యాయవాది అడిగిన విధంగా రెండు వారాలు మధ్యస్థ బెయిల్ ఇస్తే కేసు మొత్తం నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందని వివరించారు. వాదనలు, ప్రతివాదనలు విన్న కోర్టు సోమవారం నుంచి 25-8-2022 మధ్యాహ్నం 2 గంటలకు వరకు మధ్యస్థ బెయిల్ మంజూరు చేస్తూ రూ.25,000, ఇద్దరు జామీను దారులతో కాకినాడ మేజిస్ట్రేట్ కోర్ట్‌లో పెట్టి విడుదలకు ఆదేశాలు పొందాలని సూచించింది. సాక్షులను, బాధిత కుటుంబ సభ్యులను ప్రభావితం చేయటంగాని, ప్రలోభ పెట్టడం గాని చేయకూడదని, మధ్యస్థ బెయిల్ ఉన్నంతకాలం నిందితుడికి ఎస్కార్టు ఇవ్వాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. నిందితుడికి ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయకూడదని తాము చేసిన వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం అనంతబాబుకు షరతులతో కూడిన మూడు రోజుల బెయిల్‌ను మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చిందని ముప్పాళ్ళ వెల్లడించారు. నిందితుడు తన ఇంట్లోనూ... అంత్యక్రియలు జరిగే ప్రాంతంలో మాత్రమే సంచరించాలని, ఇతర ప్రాంతాలకు వెళ్లరాదని కోర్టు షరతు విధించిందని వివరించారు.

ఇనుపయుగపు ఆనవాళ్లను కాపాడుకోవాలి: ఈమని శివనాగిరెడ్డి

హైదరాబాదు: మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకుల మండలం, మూసాపేటలోని ఇనుపయుగపు ఆనవాళ్లను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. వారసత్వ స్థలాలు, కట్టడాలను పరిరక్షించడానికి చేపట్టిన 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పాస్టెరిటీ' అనే అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం మూసాపేట, సంకలమద్ది పరిసరాల్లో విస్తృతంగా పర్యటించారు. మూసాపేట నుంచి వేముల గ్రామానికి వెళ్లే దారిలో, మూసాపేట అడ్డరోడ్డుకు ఒక ఫర్లాంగు దూరంలో నున్న రామస్వామి గుట్ట సమీపంలో రోడ్డు పక్కన గల క్రీ.పూ.1000 సంవ్సరాల నాటి ఇనుప యుగపు సమాధులను పరిశీలించారు. 10 మీటర్ల వ్యాసంతో, చుట్టూ 18 నుంచి 20 పెద్దపెద్ద గుండురాళ్లతో గుండ్రంగా అమర్చిన ఆ కట్టడాల మధ్యలో ఆనాటి మానవులను పూడ్చి, వారికి జ్ఞాపకంగా మీటరున్నర నుంచి ఒక మీటరు వ్యాసంగల పెద్దరాళ్లతో నిర్మించటం వల్ల వీటిని బృహత్ శిలాయుగపు సమాధులని పిలిచారని ఆయన అన్నారు. స్థానికంగా వీటిని ముత్యంగుండు అంటామని మూసాపేటకు చెందిన రాంచంద్రయ్య చెప్పారని తెలిపారు. కొందరు పురావస్తు శాస్త్రవేత్తలు గతంలోనే గుర్తించిన ఈ సమాధులను 1988లో తాను మహబూబ్‌నగర్‌లో పనిచేసినప్పుడు

మూసాపేటలోని ఇదే స్థావరంలో 100 ఇనుపయుగపు సమాధులను నమోదుచేశానని, వ్యవసాయ భూముల విస్తరణ, రోడ్డు నిర్మాణం, కంకర రాళ్లకోసం, కట్టుబడి రాళ్లకోసం, ఆలనాపాలనాలేని ఈ ముత్యం గుండ్లను యథేచ్ఛగా వాడుకోవటం వల్ల ప్రస్తుతం ఆరు సమాధులు మాత్రమే మిగిలాయన్నారు. తెలంగాణలోని ఇనుపయుగపు చరిత్రకు, తొలితరం కట్టడ నైపుణ్యానికి, క్రీ.పూ.1000 ఏళ్లనాటి జీవనవిధానానికి ఆనవాళ్లయిన ఈ సమాధుల్ని కాపాడి భవిష్యత్తరాలకు అందించాలని మూసాపేట గ్రామస్తులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. వారసత్వ కట్టడాల పరిరక్షణ నిపుణులు శరశ్చంద్ర పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆహార భద్రత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకృతి వ్యవసా యంతోనే ఆహార భద్రత సాధ్యమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ అన్నారు. గుంటూరు రైతు సాధికారిత సంస్థ సమావేశ భవనంలో డీఎంల రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. వ్యవసాయ విభాగంలో నూతనంగా చేరిన 13 జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు హాజరయ్యారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ, మితిమీరిన రసాయనిక వినియోగం వల్ల ఆహార పదార్థాల్లో పోషక విలువలు నశిస్తాయన్నారు. రాబోయే రోజుల్లో మూడు నుంచి ఐదు రెట్ల ఆహారం తీసు కోవాల్సి వస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదాయంలో సగానికిపైగా ఆహారం కోసమే ఖర్చు చేయాల్సి ఉంటుందని అంతర్జాతీయ పరిశోధనలు వాస్తవాలను తెలియజేస్తున్నా యన్నారు. రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.రామారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని మెచ్చి, చాలా జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రైతు సాధికార సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాయని చెప్పారు.

సంపాదకీయం

కేజ్రీవాల్ మాయా యుద్ధం

వచ్చే సార్వత్రిక ఎన్నికలలోగా ప్రతిపక్షాల ఐక్యత సాధ్యం కాదని నిర్ధారించుకున్న ప్రధానమంత్రి మోదీ ఎందుకైనా మంచిదని తానే ఓ ప్రత్యర్థిని ఎంపిక చేసుకున్నారు. ఆయనే ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ముఖ్యమంత్రుల మీద లేదా ఇతర నాయకుల మీద కసి తీర్చుకోవాలనుకున్నప్పుడు మోదీ సర్కారు ఓ విశిష్టమైన పద్ధతి అనుసరిస్తోంది. కేజ్రీవాల్ మీద విమర్శలకు మాత్రమే పరిమితం అవుతూ ఆయన తరవాతి స్థానంలో ఉన్న మనీశ్ సిసోడియా మీద సీబీఐ చేత దాడులు చేయించింది. దిల్లీ ప్రభుత్వ ఆబ్కారీ విధానంలో అవకతవకలు, అక్రమాలు ఉన్నాయన్న కారణం చూపి సీబీఐని దాడులకు పురి కొల్పారు. సీబీఐ కాకపోతే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్‌ను ప్రయోగించడం పరిపాటి అయిపోయింది. అంతమాత్రం చేత మనీశ్ సిసోడియా రూపొందించిన ఆబ్కారీ విధానం లోపరహితమైందని కాదు. ఏ రాష్ట్రంలోనూ ఆబ్కారీ విధానం నిష్కల్మషంగా ఉండదు. ఇదివరకే మరో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సత్యేంద్ర జైన్ ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. అవినీతి వ్యతిరేక ఉద్యమ కెరటాల ఆసరాగా అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా అవినీతికి అతీతం కాదు అన్న అభిప్రాయం కలిగించడమే మోదీ సర్కారు ప్రధాన లక్ష్యం. ఈ ఏడాది నవంబర్ లో హిమాచల్ శాసనసభకు డిసెంబర్ లో గుజరాత్ శాసన సభకు జరగనున్న ఎన్నికలలో పోటీ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ సిద్ధం అవుతోంది. పంజాబ్ శాసనసభ ఎన్నికలలో సాధించిన విజయం ఆమ్ ఆద్మీ పార్టీలో మరిన్ని రాష్ట్రాలకు విస్తరించగలమన్న ఆత్మ విశ్వాసం పెంచింది. 2024 ఎన్నికలలోనూ మళ్లీ అధికారంలోకి రాగలమన్న ధీమా బీజేపీలో బలంగానే ఉంది. కానీ మోదీ పరిపాలనా విధానంపై విమర్శలకూ కొదవలేదు. ముఖ్యంగా సామాజిక కార్యకర్తలు మోదీని నిరంతరంగా తూర్పారబడ్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు కూడా మోదీ ఏలుబడిపై అసంతృప్తి ఇంతకన్నా ఎక్కువే వ్యక్తమైంది. అప్పుడు బీజేపీ అధికారంలోకి రావడం కష్టం అన్న మాటా వినిపించింది. కానీ అనూహ్యంగా బీజేపీ 2014 కన్నా మెరుగైన ఫలితాలు సాధించడమే కాకుండా సొంతంగానే మెజారిటీ సాధించింది. ప్రతిపక్షాల అనైక్యతే దీనికి కారణం కావచ్చు. ఇప్పుడూ అలాంటి పరిస్థితే ఉంది. ఒక వేపు మోదీ పాలనపైనే గాక ఆయన అనుసరిస్తున్న విచ్ఛిన్నకర విధానాల మీద జన బాహుళ్యం అభిప్రాయాలు ఎలా ఉన్నా ప్రజాభిప్రాయాన్ని మలచగల సామర్థ్యం ఉన్న వారిలో మాత్రం అసంతృప్తి మెండుగా ఉంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నిశ్చేష్ట స్థితి నుంచి బయట పడలేక పోతోంది. నిజానికి ఆ ఉద్దేశమే ఉన్నట్టు లేదు. మిగతా ప్రతిపక్షాలన్నింటినీ ఒక్క తాటి మీదకు తీసుకొచ్చే ప్రయత్నం చేసే ఉద్దేశమే కాంగ్రెస్ కు లేదు. పైగా ఆ పార్టీలో అసమ్మతి రాగాలు మళ్లీ ఊపందుకున్నాయి. మిగతా ప్రతిపక్షాలు ఐక్యత కోసం ప్రయత్నిస్తున్నా అవి ఏకోన్ముఖంగా లేవు. ఇద్దరు ముగ్గురు ప్రతిపక్ష నాయకులు తామే ప్రతిపక్ష శిబిరానికి నాయకులం కావాలన్న దృష్టితోనే ప్రయత్నిస్తున్నారు. మమతా బెనర్జీ, కె.చంద్రశేఖరరావు వేస్తున్న అడుగులు నాయకత్వం తమదేనన్న రీతిలో ఉన్నాయి. అయితే ఈ ఇద్దరు నాయకులూ దేశవ్యాప్తంగా ఆమోద యోగ్యులవుతారన్న భరోసా లేదు. పైగా ఈ ఇద్దరు నాయకులకూ అధికారం ఉన్నది తమ రాష్ట్రాలలోనే. విస్తరించడానికి మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ఇటీవల కొన్ని రాష్ట్రాలలో లాంఛన ప్రాయంగా పోటీ చేసినా పెద్దగా ఫలితం దక్కలేదు. కె.చంద్ర శేఖర్ రావు నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర సమితి (టి.ఆర్.ఎస్.) అసలు ఇతర రాష్ట్రాలలో పోటీ చేయాలన్న ఆలోచనలోనే లేదు. కేంద్రంలో చక్రం తిప్పాలన్న ఆతృత మాత్రం చంద్రశేఖరరావులో నిండుగా ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ రెండు చోట్ల అధికారంలో ఉంది కనక మోదీని నిలవరించగలనన్న అభిప్రాయం కేజ్రీవాల్ లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆయన నిలవరించగలరో లేదో కానీ మోదీ మాత్రం కేజ్రీవాల్ నే తన ప్రధాన ప్రత్యర్థిగా జమకడ్తున్నట్టున్నారు. ప్రతిపక్ష నాయకులందరూ అవినీతిపరులేనన్న అభిప్రాయం కలగజేస్తే తనకు తిరుగు ఉండదని మోదీ గట్టి నమ్మకంతో ఉన్నారు. అందుకే దిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను అవినీతిపరుడిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మోదీ మీద కేజ్రీవాల్ విమర్శలు తీవ్రంగానే గుప్పిస్తున్నా అనునిత్యం మాటకు మాట జవాబిస్తూ మీడియా స్థలాన్ని ఆవరిస్తున్నా అసలు శక్తి ఏమిటో రుజువు కావలసే ఉంది. ఏమైతేనేం మోదీ, కేజ్రీవాల్ మధ్య మాటల యుద్ధం రణగొణ ధ్వనులు వినిపిస్తూనే ఉన్నాయి.

అవినీతిని ఎవరు వ్యతిరేకించినా ఆహ్వానించవలసిందే. ఎన్ని అవకతవకలు జరిగినా ఉదాహరణ ప్రాయంగానైనా మోదీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం మీద గానీ, బీజేపీ అధికారంలో ఉన్న ప్రభుత్వాల మీద గానీ ఎన్ని ఆరోపణలొచ్చినా స్పందించదు. నామమాత్రంగానైనా దర్యాప్తుకు సమ్మతించదు. తాను బీజేపీలో చేరితే ఉన్న కేసులన్నీ మూసేస్తామని కేంద్ర ప్రభుత్వం నుంచి సంకేతాలు అందాయని సిసోడియా అంటున్నారు. ఈ వాదనలో నిజం ఉన్నా లేకపోయినా బీజేపీలో చేరే అవినీతిపరులు అమాంతం పరమ పవిత్రులుగా, కడిగిన ముత్యంలా మారిపోతున్న మాట వాస్తవం. ప్రత్యర్థుల మీద ముందు కళంకితులు అన్న ముద్ర వేసి తరవాత వారు బీజేపీలో చేరితే సర్వ పాపాల గరళాన్ని తన కంఠంలో దాచుకునే పరమశివుడిగా మోదీ మారిపోయారు. ప్రత్యర్థులను ఇరుకున పెట్టి వారి నోళ్లు మూయించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ తన అధికారాన్ని బాహాటంగానే దుర్వినియోగం చేస్తున్నారు. ఇలా బీజేపీలో చేరిన వారిచేత పవిత్ర స్నానాలు చేయిస్తున్న బీజేపీ అవినీతి నిర్మూలనకు కంకణం కట్టుకుందని నమ్మే అమాయకులు ఎవరూ లేరు. కానీ నియంతృత్వం కొనసాగుతున్న దశలో భిన్న స్వరాలకు విలువెక్కడ ఉంటుంది గనక! మోదీ పాలనలో అవినీతి ఒక్కటే సమస్య కాదు. రాఫేల్ కుంభకోణం మొదలుకుని ఎన్ని ఆరోపణలు వచ్చినా వాటిని చాపకిందకు తోసేయగలిగిన సాహసం బీజేపీకి ఉంది. కేజ్రీవాల్ విరామం లేకుండా మోదీ మీద విమర్శనాస్త్రాలు సంధిస్తూ ఉండొచ్చు. కానీ ఆయన పార్టీ బీజేపీకి భిన్నమైన పార్టీ ఏమీ కాదు. అన్నా హజారే 2011లో నిర్వహించిన అవినీతి పోరాటంవల్ల దిల్లీలో కేజ్రీవాల్, కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చారు. అప్పుడు ఇద్దరి ఎజెండా అవినీతి నిర్మూలనే. వారి దారులు వేరు కావడానికి అధికారానికి అంటిపెట్టుకుని ఉండాలన్న బలమైన కాంక్షే ప్రధాన కారణం. ప్రతిపక్ష నాయకులు నాయకత్వం తమకే దక్కాలన్న దుగ్ధతో ఉన్నారు తప్ప మోదీ వినాశకరమైన ఎజెండాను సవాలు చేసే సంకల్పం వారిలో లేదు. ఆ ధ్యాసే లేని వారిలో మొదటి వరసలో నిలిచేది కేజ్రీవాలే. కేజ్రీవాల్ ది మాయా యుద్ధం కావచ్చు.



అమిత్ షా, జూనియర్ ఎన్టీఆర్‌ల భేటీ

రాజకీయ "తమాషాలు"!

అమిత్ షా కేంద్ర హెూం మంత్రి. ప్రధాన మంత్రి మోదీ తర్వాత ఆయన చుట్టే అధికారం కేంద్రీకృతమై ఉన్నది. పనిగట్టుకొని రామోజీ ఫిలింసిటీకి వెళ్ళి రామోజీరావును కలిశారు. హైదరాబాదు విమానాశ్రయం వద్ద ఒక హెూటల్‌కు జూనియర్ ఎన్టీఆర్‌ను ఆహ్వానించి, కలుసుకొన్నారు. వారిని కలిసినట్లు ఫోటోలతో ట్విట్టర్‌లో పోస్టులు పెట్టారు. కలిస్తే తప్పేంటని ఎవరైనా అడగవచ్చు. వ్యక్తుల మధ్య కలయికలకు ప్రజలు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ, అమిత్ షా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అడిగినా ఇంటర్వ్యూ ఇవ్వరని వినికిడి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్ళి ఇంటర్వ్యూ దొరక్క వెనక్కి వచ్చిన ఉదంతాలు, రాత్రి పొద్దు పోయాక సమయమిస్తే కలుసుకున్న ఘటనలు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్నాం. అంత "బిజీ"గా ఉండే అమిత్ షా తెలుగు నాట పర్యటనకు వచ్చి ఒక ప్రముఖ పత్రికాధిపతిని, ఒక సినీనటుడ్ని కలవడంలో తప్పనిసరిగా రాజకీయ అజెండా ఉంటుందని ప్రజలు భావించడం సహజమే కదా!

ఈ కలయికల వెనుక రాజకీయ అజెండా ఉన్నదని కాషాయ దళం ఒప్పుకోక పోయినా, కలయికల ఆంతర్యం బహిరంగ రహస్యమే. వివిధ రంగాలలో ప్రముఖులను కలుసుకొని, మచ్చిక చేసుకోవాలన్న ఒక ఎత్తుగడను గత కొంతకాలం నుంచి అమలు చేస్తున్నారు. ఆ ఎత్తుగడలు, వ్యూహాల్లో అంతర్భాగంగా ఈ తరహా కృత్రిమ ఆప్యాయత ఒలకబోస్తూ ప్రముఖులను కలవడం ద్వారా ప్రజలను మాయచేయాలని, భ్రమల్లో, ఊహాగానాల్లోకి నెట్టాలన్న ఆలోచన దాగి ఉన్నది. వాటిని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసుకోవడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే రాచక్రీడలో కాషాయ దళం ముందుంది. కేంద్ర మంత్రి కాకముందు అమిత్ షా మరో పత్రికాధిపతి వేమూరి రాధాకృష్ణ ఇంటికెళ్ళి కలిసినట్లు గుర్తు. విజ్ఞులైన ప్రజలు విచక్షణతో ఒక్క విషయాన్ని ఆలోచించాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బిజెపి భాగస్వామే కదా! తల్లిదండ్రులను చంపి, పిల్లాడ్ని అనాధగా వీధిన పడేశారని ఒకనాడు (ప్రధానమంత్రి కాకముందు) వాపోయినవ్యక్తి మోదీనే కదా! అప్రజాస్వామికంగా రాష్ట్రాన్ని విభజించారని పదేపదే పార్లమెంటులోనే వ్యాఖ్యానించింది కూడా ఆ పెద్దమనిషే కదా! కేంద్రంలో ఎనిమిదేళ్ళుగా అధికారాన్ని వెలగబెడుతున్నది బిజెపినే కదా! అలాగే, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం - 2014 అమలును పర్యవేక్షించే బాధ్యత నిర్వహిస్తున్నది అమిత్ షానే కదా! విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకుండా, ప్రత్యేక తరగతి హెూదా ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేస్తున్నది ఎవ్వరు? చేయాల్సిన పనులు చేయకుండా, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తూ, ప్రముఖ వ్యక్తులను ప్రత్యేకంగా కలిసి, ఆలింగనాలు చేసుకోవడం వల్ల తెలుగు జాతికి ఒరిగేదేంటి! కేవలం ప్రజల దృష్టిని మళ్ళించి, రాజకీయ లబ్ధి పొందాలనే కుటిల రాజనీతిని ప్రదర్శిస్తున్న ఈ తరహా రాజకీయ నాటకాలను తిలకించండేగానీ, ప్రభావితులు కావద్దని చిన్న విన్నపం. ఆలోచించండి??

టీ. లక్ష్మీనారాయణ, సామాజిక ఉద్యమకారుడు

డెంగ్యూ వ్యాధి నిర్మూలించాలి

ఇ-మెయిల్

ప్రపంచ వ్యాప్తంగా గత రెండు సంవత్సరాల నుంచి కరోన మహమ్మారి వలన కోట్ల మంది ప్రాణాలు హరించబడ్డాయి. ప్రస్తుతం వాక్సినేషన్ వలన కరోన తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి తీసుకుంటున్నారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో కుంభవృష్టితో పాటు చరిత్రలో కనీ వినని వరదలు ముంచెత్తినాయి. ముఖ్యంగా గోదావరినదికి భద్రాచలం వద్ద 70 అడుగుల నీటిమట్టం పెరగడం ఒక రికార్డ్. ఇప్పటికి భద్రాచలం పరిసర రెండు వందల గ్రామాలు వరదనీటితో నిండి ఉన్నాయి. ఈ అకాలవర్షాలు, వరదలవల్ల ప్రజలకు అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ వరద నీరు నిల్వ ఉండటం తో అతి ప్రమాద "డెంగ్యూ" వ్యాధి పెరుగుతుంది. తెలంగాణలో ఈ డెంగ్యూ కేసులు ప్రతి రోజు పదివేల నుంచి ఇరవై వేల వరకు నమోదు అవుతున్నాయి.ఈ డెంగ్యూవ్యాధి నీరు నిల్వ ఉన్నచోట నీటిలో పుట్టే 'ఎడిస్'దోమ వల్ల వస్తుంది.ఈ డెంగ్యూజ్వరంవల్ల ఒళ్ళు నొప్పులు, చర్మం పై దద్దుర్లు కనుగుడ్ల నొప్పులు ఉంటాయి. డెంగ్యూజ్వరం ఎడిస్ దోమకాటువల్ల వస్తుంది. నిల్వఉన్న నీటిలో దోమల లార్వా అధికంగా వృద్ధి చెందుతుంది. ఈ డెంగ్యూ జ్వరం వలన కొన్ని సార్లు రక్త కణాలు తగ్గి రోగి మృత్యువాత పడే ప్రమాదంఉంది. కొంతమందికి ఊపిరితిత్తులు, మూత్ర పిండాలపై కూడ ప్రభావం చూపుతుంది.ప్రజలకు కొద్దీపాటి జ్వరం రాగానే డెంగ్యూపరీక్ష చేయించుకోవాలని రాపిడ్‌టెస్ట్ బలవంతంగా భయపెట్టి ప్రైవేట్ ఆసుపత్రుల వారు చేస్తున్నారు. ఈ రాపిడ్ టెస్ట్ వలన పూర్తిగా ఫలితాలు రావు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేసే సిరాలజీ టెస్ట్ ద్వారానే డెంగ్యూ జ్వర పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వ అధికారులు ప్రైవేట్ ఆసుపత్రుల యజమానులకు సూచన ఇవ్వాలి. మనదేశంలో సహజంగా నిరుపేదవారు, బిచ్చగాళ్ళు, అనాధలు ఎక్కువగా సామూహికంగా, మురికివాడలలో నివసించడం జరుగుతుంది. మురికి కాలువల వద్ద కూడా నివాసం కలిగిఉండటం వలనే ఈ డెంగ్యూ వ్యాధి పెరుగుతుంది. డెంగ్యూ, అంటువ్యాధుల నిర్మూలనకేంద్రాలు ఏర్పాటుచేసి ప్రజలందరికీ ఉచితంగా కరోన వాక్సినేషన్ ఇచ్చినట్లుగా అంటువ్యాధులు రాకుండా ఉచిత వాక్సినేషన్ ఇవ్వాలి.

ఆళవందార్ వేణుమాధవ్, 8686051752

సంక్షేమం వర్సెస్ ఉచితం

సురవరం సుధాకరరెడ్డి

రాజకీయం పార్టీలు ఓటర్లను ఆకట్టుకునేందుకు "ఉచితం" ఇస్తున్నారని ప్రధాని మోదీ విమర్శించిన తర్వాత దీనిపైన తగు నిర్ణయం తీసుకునేందుకు కేంద్ర ఎన్నికల కమీషన్‌కు సుప్రీంకోర్టు సూచిస్తే, అది తమ బాధ్యతకాదని, పార్లమెంట్‌లో చర్చించాలని ఎన్నికల కమీషన్ జవాబిచ్చింది. సంక్షేమాలు వేరు, ఉచితాలు వేరని, వీటిని విభజించడం కష్టమని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ వ్యాఖ్యానించారు. సంక్షేమ కార్యక్రమాలను ఉచితాలంటారా అని కేంద్రంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ దాడి చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ కూడా దాదాపు ఇలాంటివైఖరి తీసుకున్నారు. దీనిపై దేశ వ్యాపిత చర్చ జరుగుతున్నది. చర్చ ఇంకా విస్తృతంగా జరగాల్సి వుంది. ప్రభుత్వం తన నిధుల నుండి ప్రజలకు నగదు రూపంలో గాని, వస్తు రూపంలోగాని, తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేని సహాయాన్ని ఉచితాలు అంటారు. ఎన్నికల ముందు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఆయా పార్టీలు చేర్చే వాగ్దానాలలో భాగంగా ఈ ఉచితాలు ఇస్తున్నారని ప్రధాని మండిపడు తున్నారు. కాని కేంద్రం, రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వాలు కూడా ఈ ఉచితాలు పంచిపెడుతున్నాయి. ఐతే తమకంటే ఎక్కువగా ప్రాంతీయ పార్టీలు ఉచితాలు ఇస్తున్నాయని మోదీ ఆవేశపడుతున్నారు.

స్టాలిన్ చెప్పినట్లు, సంక్షేమ కార్యక్రమాలు, ఉచితాలు వీటి గురించి మరింత సమగ్రమైన చర్చ జరగాలి. పెట్టుబడిదారి వ్యవస్థలో పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న దారిద్ర్యంలో వున్న ప్రజలు, ప్రభుత్వాల మీద తిరగబడకుండా వుండేందుకు కొన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాయి. అక్టోబర్ మహా విప్లవం తర్వాత సామ్రాజ్యవాద దేశాలు పెట్టుబడి దారి ప్రభుత్వాలు, సోషలిజం పట్ల ప్రజలు ఆకర్షితులు గాకుండా వుండేందుకు సంక్షేమ కార్యక్రమాలు అవసరమని భావించాయి. వలసదేశాల నుండి తాము కొల్లగొట్టి తెచ్చిన లక్షల కోట్ల రూపాయల సంపదలో కొంత చిన్న భాగాన్ని సంక్షేమం పేరుతో ప్రజలకు పంపకం చేసారు. పెట్టుబడిదారి వ్యవస్థ సుస్థిరత కోసం "సంక్షేమ రాజ్యం" నినాదం ముందుకొచ్చింది. కొత్తగా అభివృద్ధి చెందుతున్న, పాత వలస దేశాలలో "అదనపు దోపిడి ఆదాయం" లేనందుకు తమ స్వంత ఆర్థిక వనరుల నుండి అంతో, ఇంతో సంక్షేమ కార్యక్రమాలు ఇవ్వాల్సి వచ్చింది. జాతీయోద్యమ దేశాలలో స్వాతంత్ర్యం తర్వాత ఆదాయాలు తక్కువ. జాతీయ బూర్జువావర్గం ప్రాధాన్యతల మధ్య పోటీ వుంటుంది. దుర్భరమైన దారిద్ర్యాన్ని తగ్గించేందుకు గ్రామీణ ప్రాంతాలలో భూమి పంపిణీ, ప్రాజెక్టుల ద్వారా నీరు, వ్యవసాయానికి విద్యుచ్ఛక్తి, వీటితోపాటు విద్యా, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సివచ్చింది. పారిశ్రామికీకరణ ద్వారా, సంపద సృష్టి, ఉద్యోగాల సృష్టి ప్రారంభించారు. భారతదేశంలో పెద్ద పరిశ్రమల ఏర్పాటు గనుల నుండి ఖనిజాల వెలికితీత, తదితరాలను ఏర్పాటు చేయగలిగిన పెట్టుబడిదారులు తగినంత మంది లేనందుకు ప్రభుత్వమే పూనుకొని కీలక రంగాలలోను జాతీయం చేసి పెట్టుబడులు పెట్టింది. దీనిని మితవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తే, ఉదారవాదులు బలపరిచారు. విద్య, వైద్యం, కొంతమేరకు విస్తృత పరిచారు. సాంకేతిక విద్య వల్ల అనేక లక్షల మంది నిపుణులు తయారయ్యారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగించుకునేందుకు అనేక పరిశోధనా సంస్థలను స్థాపించారు. కీలకరంగాలలో ప్రభుత్వరంగం రావటంతో ఇది నెహ్రూ సోషలిస్టు తరహా సమాజ నిర్మాణంగా కొందరు భావించారు. ప్రకటించారు.

ప్రభుత్వం బూర్జువావర్గం చేతుల్లో వున్నప్పుడు ప్రభుత్వరంగం వృద్ధి చెందుతుంది తప్ప ప్రజారంగం కాదని కమ్యూనిస్టులు భావించారు. ఐతే ప్రభుత్వరంగాన్ని బలపరిచారు. ప్రభుత్వ రంగంలో వేతనాల పెంపుదల, ఉద్యోగభద్రత అన్నింటికంటే ముఖ్యంగా రిజర్వేషన్ల అమలు, ఆయా రంగాలలో ఉత్పత్తి అయ్యే వస్తువుల ధరలు స్థిరీకరణ వచ్చే ఆదాయం ప్రభుత్వానికి చేరడం లాంటి ప్రయోజనాలు వున్నాయి. కాని కొన్ని పబ్లిక్ సెక్టార్ పరిశ్రమలు, ఎంటర్ ప్రైజస్ అనేక కారణాల వల్ల నష్టపోయినాయి. ప్రభుత్వ రంగానికి గల పరిమితుల్లో దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కాలేదు. ప్రైవేట్ రంగంలో మిశ్రమ ఫలితాలు వున్నాయి. పర్మనెంట్ ఉద్యోగాల బదులు కాంట్రాక్టు ఉద్యోగాలు వచ్చాయి. ధరలు పెరిగాయి. దేశంలో సంఘటిత రంగ కార్మికులు 6 శాతం ఉంటే అసంఘటిత రంగంలో 94శాతం వున్నారు. సంపద కేంద్రీకృతమైంది. వ్యవసాయరంగం కుదేలైంది. వలస కార్మికులు లక్షల నుండి కోట్ల సంఖ్యకు చేరారు. దారిద్ర్యం పెరిగింది. దేశంలో పెట్టుబడిదారి వ్యవస్థ పెరిగే కొద్ది దారిద్ర్యం పెరిగింది. కూడు, గుడ్డ, నీడ లేని పేద జనం సంఖ్య పెరిగింది.

ఈ నేపథ్యంలో సంక్షేమ కార్యక్రమాలు, ఉచితాలు పెరిగాయి. సార్వత్రిక ఉచిత ప్రాథమిక విద్య, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత వైద్యంతోపాటు, రూపాయి కిలో బియ్యం మొదలు ప్రవేశించింది. తమిళనాడులో యంజీ రామచంద్రన్ ప్రారంభించి విజయవంతమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా విజయ భాస్కరరెడ్డి, ప్రతిపక్షంగా యన్.టి.ఆర్ రూపాయకు కిలో బియ్యం ప్రకటించారు. యన్‌టిఆర్ గెలిచాడు. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు రేషన్ బియ్యం 65 పైసలకు ఇచ్చేవారు. ఐతే రేషన్‌కార్డులు కొన్ని లక్షల మందికి మాత్రమే వుండేవి. రానురాను అసాధారణంగా పెరిగాయి. ప్రభుత్వ సొమ్ముతో ఉచితాలు పంచి ఓట్లు దండుకుంటున్నారన్న విమర్శలు పెరిగాయి. కరువులు, వరదలు, సునామీలు, ప్రకృతి బీభత్సాలలో ప్రభుత్వ సహాయం (అవినీతితో సహా) అనివార్యమైంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ వలసలు తగ్గాయి. ఇది చాలా మంది రైతులకు ఇష్టం లేదు. ఉచితాలలో కొన్ని అవసరమైనవి. బియ్యం పథకం ఆకలి చావులు తగ్గించింది. తెలంగాణలో కొన్ని సంపద పునరుత్పత్తికి ఉపయోగపడేవి. ఐతే అంతులేని అవినీతి దానిని నష్టపరుస్తుంది. రైతుబంధు పేద రైతులకు పరిమిత సహాయంకాగా, పెద్ద రైతులకు ఎక్కువ లాభిస్తుంది. దీనిని 5 ఎకరాల లోపు రైతుకు పరిమితం చేసి ఎక్కువ సహాయం పేదలకు ఇవ్వవచ్చు. నగరంలో అందరికి ఉచిత మంచినీరు పథకం అనవసరం. నీటి బిల్లు కట్టగలిగిన మధ్య తరగతి, ధనిక వర్గాలకు ఇది అనవసరం.

ప్రభుత్వానికి అధిక ఖర్చు. ఇది కార్పోరేషన్ ఎన్నికల కోసం ఉద్దేశించింది. వ్యవసాయ విద్యుచ్ఛక్తికి కూడా ఉచితం కొంత పరిమితులులో ఉండాలి. ప్రొఫెషనల్ కాలేజీలలో ఉచిత విద్యకై రీయంబర్సుమెంట్, కార్పోరేట్ కాలేజీలను కాపాడటానికి ఉపయోగపడుతుందని విమర్శలున్నాయి. దానిని పేద వర్గాలకే పరిమితం చేసి వుండాల్సింది. సంక్షేమ కార్యక్రమాలకు ఉచితాలకు కావలసిన డబ్బు కోసం ప్రజలకు మద్యపానం అలవాటు చేసి, వారి ఆరోగ్యాలు, ఆదాయాలను ప్రభుత్వం కొల్లగొడుతున్నది. అది చాలక పోతే అప్పులు తెస్తున్నది.

ఏది సంక్షేమం, ఏది ఉచితం అనేది కొంత సంక్లిష్టమైన విషయమే ఐనా, ఈ ఉచితాలు అశాస్త్రీయంగా అప్పనంగా పంచితే అభివృద్ధికి నిధులు లేకుండా చేస్తుంది. "అప్పు చేసి పప్పు కూడు" అంటే అది అవసరం. అప్పు చేసి పంచ బక్ష పరమాన్నాలు, చికెన్లు, బ్రాందీలతో భోజనం ఐతే దివాలే. రాబోయే దశాబ్దాలు ఈ అప్పుల వడ్డీలకే సరిపోతుంది. ఉచితాలు ఇచ్చినా ఓట్లు రాలవు. చంద్రబాబు కోటి వరాలు ప్రకటించినా ఓడిపోయారు. కేసిఆర్, దళిత బంధు ప్రకటించినా, హుజూరాబాద్‌లో ఉప ఎన్నికల్లో ఓడిపోయాడు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుచ్ఛక్తి కొంతమేరకు రాజశేఖరరెడ్డికి ఉపయోగపడినా, రాజకీయ పరిస్థితుల సానుకూలత ప్రధానంగా ఉపయోగ పడింది. ఉచితాలు ప్రకటించకపోయినా కేరళలో వామపక్షాలు గెలిచాయి. అనేక పార్టీలు ఉచితాలతోపాటు, డబ్బులిచ్చి ఓట్లు కొనుగోలు చేస్తున్నాయి. వాస్తవానికి దేశంలో అన్ని ఉచితాలు కలిపినా, (కేంద్రం, రాష్ట్రాలు) కార్పోరేట్లకు ఇచ్చిన పన్ను రాయితీలు, బ్యాంకుల పారుబాకీల రద్దు కంటే తక్కువే చాలా తక్కువ. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 8 సంవత్సరాల కాలంలో, ఆయన మిత్రుడు ఆదానీ సంపద వందల రెట్లు పెరిగి ప్రపంచ కుబేరులలో 4వ స్థానంలో వున్నాడు. అంబానీ, అదానీలు కోవిడ్ సమయంలో ప్రతి గంటకు కొన్ని కోట్లు పోగేసుకుంటే, దేశంలో దాదాపు 50 కోట్ల ప్రజలు తమ ఆదాయాన్ని కోల్పోయి, దుర్భరమైన దారిద్ర్యానికి గురయ్యారు.

ఇప్పటికే కేంద్రప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు, వైద్య నిధులు గత బడ్జెట్‌లో పెద్దయెత్తున తగ్గించారు. ఆదాయపు పన్ను స్లాబులు మార్చడం ద్వారా నూతన ప్రతిపాదన నెలకు రూ.25,000/- వేతనం పొందే క్లాస్ ఫోర్ ఉద్యోగులు కూడా టాక్సు కట్టాలి. నెలకు రూ.80,000/- వేతనం పొందే ఉద్యోగులు కార్మికులు, లక్ష రూపాయల ఆదాయం వుండే వ్యాపారస్తులు 30శాతం ఆదాయపన్ను కడితే, సంవత్సరానికి రెండు లక్షల కోట్ల ఆదాయం సంపాదిస్తున్న కార్పోరేట్ సంస్థలు 20 శాతం మాత్రమే ఆదాయపు పన్ను ఒడుతున్నాయి. ప్రతిపక్ష రహిత భారతదేశం బిజెపి చేతిలోకి పోతే ఉచితాలు, అన్ని రద్దయితాయి. రైల్వేలు, ఇన్సూరెన్స్, బ్యాంకులు, కంపెనీలన్ని రద్దవుతాయి. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ కోరినట్లుగా రిజర్వేషన్లపై సమీక్ష అవసరం లేకుండా ప్రైవేటీకరణ ద్వారా అన్ని సంస్థల్లో రిజర్వేషన్లు రద్దయితాయి. ప్రజాస్వామ్యానికి అబ్రహం లింకన్ నిర్వచనం ప్రకారం ప్రజల యొక్క ప్రజల వల్ల, ప్రజల కొరకు నడిపే ప్రభుత్వం. కాని భారతదేశంలో ఆదాని కోసం, బిజెపి వల్ల, నరేంద్రమోదీ ద్వారా నడిపే హిందూ రాజ్యం ఏర్పడుతుంది.

సంక్షేమ కార్యక్రమాలు, ఉచితాలు ఎప్పుడు తాత్కాలిక ఉపశమనాలు మాత్రమే. దారిద్రానికి కారణమైన దోపిడి వ్యవస్థను పడదోసే సోషలిజం మాత్రమే ఖచ్చితమైన శాశ్వత పరిష్కారం. దేశంలో ఆదాయాల వ్యత్యాసం పోవాలంటే, సృష్టిస్తున్న సంపదను న్యాయబద్ధంగా పంపిణీ చేయాలి. అది సోషలిజంలోనే సాధ్యం.

స్వేచ్ఛ, హక్కులు లేని పాలనలో అభివృద్ధి

టి.వి.సుబ్బయ్య

స్వేచ్ఛ, హక్కులు లేని మోదీ నాయకత్వంలోని బిజెపి పాలనలో నేడు మనం బతుకుతున్నాము. సాధించిన లక్ష్యాలను సమీక్షించుకొని, భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవడం మంచి పరిపాలకుడి లక్షణం. 75 వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ ఎప్పటివలె కొత్త వాగ్దానాలు చేయకుండా లక్ష్యాలను ప్రకటించారు. 2014 లో ఆయన చేసిన, చేస్తూ వచ్చిన వాగ్దానాల్లో దాదాపు అన్నింటినీ మరిచిపోయారు. అందుకే లక్ష్యాలు మాత్రమే ప్రకటించారని భావించవచ్చు. స్వాతంత్ర్య పోరాట యోధులు, దేశ పథ నిర్దేశకులు చెప్పిన మాటలకు పూర్తి విరుద్ధంగా పాలన సాగిస్తున్నారు.వ్యక్తి పూజ ప్రజాస్వామ్యంలో నియంతృత్వానికి దారి తీస్తుందని రాజ్యాంగ రచయిత డాక్టరు అంబేద్కర్ ఆనాడే హెచ్చరించారు. గణనీయంగా దేశంలో అభివృద్ధిని సాధించిన ప్రథమ ప్రధాని, సంకుచిత మతతత్వం, కులతత్వం, జాతీయ వాదాల విషయంలో జాగ్రత్త వహించాలని, రాజ్యానికి మతతత్వం దూరంగా ఉండాలని హెచ్చరించారు. అయితే మోదీ పాలనలో ఈ రెండూ వేగంగా అమలవుతున్నాయి. స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా, బ్రిటీషు పాలకులకు దగ్గరగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ మోదీ పాలనలో కుల, మత తత్వాలను అధికం చేసింది. ఇందుకు అనుగుణంగానే మోదీ పాలన సాగిస్తూ సామాన్య ప్రజలను పట్టించుకోకుండా అత్యంత సంపన్నులను మరింతగా పెంచారు.

ఆయన నిర్దేశించిన ఐదు లక్ష్యాలలో, అభివృద్ధి చెందిన దేశంగా నిలపడం, మన మూలాలు చూసి గర్వించడం, ఐక్యత, ప్రజల్లో జవాబుదారీతనం. ఇప్పటికి జరిగిన అభివృద్ధి అంతా అతి సంపన్నులు, ఆశ్రితుల చేతుల్లోకి చేరింది. ప్రజల నిత్య జీవనం ఏ మాత్రం మెరుగుపడకపోగా, జీవన వ్యయం బాగా పెరిగింది. ఇక మూలాలు చూసి గర్వపడటం అంటే మతం రాజ్యమేలిన కాలం వైపు మళ్లించడమేనని ఇంతవరకు జరిగిన మోదీ పాలన అనుభవాలు చెప్తున్నాయి. దేశ ప్రజల్లో ఐక్యత, సామరస్యం లేకపోగా మతాల మధ్య ద్వేషం, అసహనం, మత ఘర్షణలు పెరిగాయి. ఇక ప్రజల్లో జవాబుదారీతనం. ఇది పాలకుల్లోనే లేకుండా పోయిందని ప్రజలు గ్రహించారు. యధారాజా తథా ప్రజా చందాన పరిస్థితి ఉంది. ప్రసంగాలు చేసిన, వాగ్దానాల అమలును పట్టించుకోకపోవడం ఆయన ప్రత్యేకత.

అవినీతిని అడ్డుకొని 2 లక్షల కోట్లు మిగిల్చి ప్రజల అభివృద్ధికి ఖర్చు చేశానన్నారు. మోదీ పాలనలో 12 లక్షల కోట్ల రూపాయలకు పైగా బ్యాంకులు రద్దు చేశాయని రిజర్వు బ్యాంకు స్వయంగా పదేపదే ప్రకటించింది. అవినీతిపరులను ప్రోత్సహించడం నీతి అవుతుందా? చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనట్లు, ప్రజల కష్టార్జితం అవినీతిపరుల పాలైంది. ఎన్నికల బాండ్ల ద్వారా వందల కోట్లు పొందుతూ, అదేమవుతుందోకూడా స్పష్టతలేని విధానంతో అవినీతిని చట్టబద్ధంచేయడం కాదా? ఇది నల్లధనం డబ్బు కాదా?

ఉద్యోగాల కోసం, కాంట్రాక్టుల కోసం, ఇతర పనుల కోసం దాదాపు 62 శాతం లంచాలు ఇస్తున్నారని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ అంచనా వేసింది.

75 ఏళ్ల స్వాతంత్ర్యంలో నేటికీ లక్షలాది మంది బాల, బాలికలు వెట్టిచాకిరీ బానిసత్వంలో ఉన్నారు. కులతత్వంతో పాఠశాలల్లో సైతం జ్ఞానం పెంచవలసిన టీచర్లు విద్యార్థులను కొట్టి చంపుతున్నారు.రెండు గ్లాసుల, రెండు కుండల విధానం చూసి పాలకులేమీ సిగ్గుపడటం లేదు. లక్షల మంది బాలికల, మహిళల అక్రమ రవాణా యధేచ్ఛగా సాగిపోతోంది. ఆశ్రిత పక్షపాతం వలదన్నారు మోదీ ఇంత కాలం అదే చేస్తున్నారని అందరికీ తెలుసు. బిజెపి పాలిత రాష్ట్రాలకు అనుకూలంగా, ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల పట్ల మరో విధంగా ఉంటూ సన్నిహిత స్నేహితులకు ప్రాజెక్టులు కట్టబెడుతున్న విధానం ఆశ్రిత పక్షపాతం కాదా? మోదీ అధికారంలోకి వచ్చేనాటికి సామాన్యులకు, మధ్య తరగతి ప్రజలకు కుటుంబాలను బట్టి రూ.5 వేల నుండి రూ.10వేలు పెరిగింది. ఈ అంశాన్ని అసలు పట్టించుకోరు. ఇప్పటికీ 20 కోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారు. ఆకలి సూచి, అభివృద్ధి సూచి తదితర అత్యధిక అంశాల్లో మనం చిన్న చిన్న దేశాల కంటే వెనుకబడి ఉన్నామని అనేక దేశ, విదేశీ సర్వేలు చెప్పడమే కాదు, దేశ ప్రజల అనుభవం కూడా. శాస్త్రీయ దృక్పథం స్థానే కుల, మత భావనలు పెంచే దిశగా పాఠ్యాంశాలను మార్చివేస్తున్నారు. చరిత్రను సమూలంగా మార్చి మత రాజ్యం వైపు పయనిస్తూ ప్రజల్లో ఆ భావజాలాన్ని విస్తరింపజేశారు. మహిళలను గౌరవించాలని చెప్పడమే గానీ మనది గొప్ప సంస్కృతి అని చాటే శక్తులు మహిళను గౌరవించకపోవడం, అక్రమాలు, అత్యాచారాలు పెంచుతున్నాయి.

ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో మోదీ చాలా తెలివిగా తాను చేసిన అనేక వాగ్దానాలను సైతం దాటవేశారు. సహకార ఫెడరల్ వ్యవస్థను పటిష్ఠం చేస్తానని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తానని, విదేశాల నుండి నల్లధనం వెనక్కి తెచ్చి ఇంటింటికీ పంపిణీ చేస్తానని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తానని వాగ్దానాలు గుప్పించారు. సహకార ఫెడరల్ వ్యవస్థను దిగజార్చుతూ, రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారు. గ్రామీణ, పట్టణ నిరుద్యోగాన్ని మరింత పెంచారు. నల్లధనం వెనక్కి తీసుకురావడం అటుంచి, విదేశాల్లో నల్లధనం మోదీ హయాంలో పెరిగిందన్న వార్తలు పదేపదే వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌కు మొండి చేయి చూపారు. రాజ్యాంగం రోజురోజుకీ బలహీనమవుతూ, స్వాతంత్ర్యానికే ముప్పు కలిగే వాతావరణం క్రమంగా విస్తరిస్తోంది. వ్యక్తిగత గోప్యతా హక్కును వాక్ స్వాతంత్ర్యాన్ని కొరగాకుండా చేశారు. అచ్చేదిన్‌ను అటుంచి బురాదిన్ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రతిపక్షాలను ముఖ్యంగా కాంగ్రెస్‌ను నిర్వీర్యం చేస్తూ, నియంతృత్వ పాలన పోకడలను అనుసరిస్తున్నారు. మెజారిటీ మత వాదాన్ని ప్రోత్సహించడం వల్ల ఉన్మాదులు చెలరేగుతున్నారు. దర్యాప్తు సంస్థలు, ఎన్నికల కమీషన్ ఇతర వ్యవస్థలన్నీ మోదీ కనుసన్నల్లోనే పని చేస్తున్నాయన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది. రాజ్యాంగం, స్వాతంత్ర్య పరిరక్షణ ప్రజల కర్తవ్యం.

రైతుల 'మహాపంచాయత్'

ఢిల్లీలో భారీగా నిలిచిన ట్రాఫిక్

న్యూఢిల్లీ: 'మహా పంచాయత్'కు హాజరయ్యేందుకు జంతర్ మంతర్ వద్దకు వేలాది మంది రైతులు చేరుకోవడంతో ఘాజీపూర్, సింఘు సహా ఢిల్లీ సరిహద్దు వద్ద సోమవారం భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసుల ఆంక్షల మధ్య కొంతమంది ప్రయాణికులు గంటకు పైగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారని ఉన్నతాధికారులు తెలిపారు. రాజధానిలోకి ప్రవేశించే అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నామని, పోలీసు సిబ్బంది 'అప్రమత్తం'గా ఉన్నారని వారు చెప్పారు. ఘాజీపూర్, సింఘు సరిహద్దుల్లో ఒక్కొక్కటిగా పోలీసులు తనిఖీలు చేస్తుండడంతో వాహనాలు పెద్ద వరుసలో కనిపించాయి. 'మహా పంచాయత్' దృష్ట్యా ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లలో ఇది భాగమని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. కర్నాల్ రోడ్డు, లిబాస్ పూర్, సమయ్‌పూర్ బదాలి, నరేలాతో సహా సరిహద్దులకు ఆనుకుని ఉన్న రోడ్ల దగ్గర కూడా భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రైతుల సంఘం పిలుపునిచ్చిన 'మహాపంచాయత్' కారణంగా ఢిల్లీ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు తెలిపారు. 'నేను ఇప్పుడు గంటకు పైగా జీటీ కర్నాల్ రోడ్డులో చిక్కుకున్నాను. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. కనీసం మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల వరకు వాహనాలు విస్తరించి ఉన్నాయి. ఢిల్లీలోని లియుటెన్స్‌లో ఉన్న నా కార్యాలయానికి వెళ్లేందుకు ఆలస్యమవుతోంది. ఈ ట్రాఫిక్ నా పనిని మరింత ఆలస్యం చేస్తుంది' అని ఒక ప్రయాణికుడు చెప్పారు. ఢిల్లీ వైపు వచ్చే వాహనాలను తనిఖీ చేయడం, కొన్ని పాయింట్లు, కూడళ్లలో అదనపు పికెట్‌ను ఏర్పాటు చేయడం వంటి జాగ్రత్తల కారణంగా వాహనాల రాకపోకలు నెమ్మదించాయని పోలీసు ఉన్నతాధికారి చెప్పారు. అయితే విన్సడర్ ప్యాలెస్, ఔటర్ సర్కిల్ కన్నాట్ ప్లేస్, పార్లమెంట్ స్ట్రీట్‌తో సహా న్యూఢిల్లీ ప్రాంతంలో ట్రాఫిక్ సాధారణంగా ఉందని ఆయన అన్నారు. 'ట్రాఫిక్ ఉద్యమం నెమ్మదిగా ఉంది. కానీ సాఫీగా కదులుతోంది. బాబా ఖరక్ సింగ్ మార్గ్ వద్ద రైతుల ఉద్యమం జరిగినందున ట్రాఫిక్‌ను మళ్లించారు. గోల్ డక్ ఖానా వద్ద కూడా ట్రాఫిక్ మళ్లించాము' అని ట్రాఫిక్ విభాగానికి చెందిన పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. పెద్ద క్రేన్ పనిచేయకపోవడం వల్ల గురుగ్రామ్ వైపు వాహనాల రాకపోకలపై ప్రభావం పడినందున ఎన్‌హెచ్-48పై ట్రాఫిక్ కూడా ప్రభావితమైంది. శాంతిభద్రతల ప్రత్యేక పోలీసు కమిషనర్ దీపేంద్ర పాఠక్ మాట్లాడుతూ 'శాంతిభద్రతలను కాపాడటానికి, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా మేము తగిన ఏర్పాట్లు చేశాము(అని తెలిపారు. అంతకుముందు రోజు, టాల్‌స్టాయ్ మార్గ్, సంసద్ మార్గ్, జన్‌పథ్ రోడ్, అశోకా రోడ్, ఔటర్ సర్కిల్ కన్నాట్ ప్లేస్, బాబా ఖరక్ సింగ్ మార్గ్, పండిట్ పంత్ మార్గ్‌లను నివారించాలని పోలీసులు వాహనదారులను కోరారు.

పన్సారే కేసు ఏటీఎస్‌కు అప్పగింత

ముంబై: సీపీఐ నేత, హేతువాది గోవింద్ పన్సారే హత్యకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక దళం(ఏటీఎస్) చేతికి అందజేసినట్లు ఏటీఎస్ అధికారి ఒకరు సోమవారం వెల్లడించారు. ఈ కేసును ఇప్పటి వరకు మహారాష్ట్ర నేరపరిశోధనా విభాగం(సీఐడీ) దర్యాప్తు చేసింది. హత్యకు సంబంధించిన పత్రాలన్నీ అందడటంతో కేసు తదుపరి దర్యాప్తు బాధ్యతను ఏటీఎస్ తీసుకుంది. పన్సారే కేసును ఏటీఎస్‌కు అప్పగించాలని బోంబే హైకోర్టు ఇప్పటికే ఆదేశించిన విషయం విదితమే. 2015 ఫిబ్రవరి 16న పన్సారేపై కొల్హాపూర్‌లో కాల్పులు జరిగాయి. తీవ్రంగా గాయపడిన ఆయన ఫిబ్రవరి 20న మృతిచెందారు. ఈ కేసును సీఐడీకి చెందిన సిట్ దర్యాప్తు చేసింది. ఈ కేసులో సీఐడీ కొంతమంది నిందితులను అరెస్టు చేసింది. ఈ కేసు దర్యాప్తులో సీఐడీ ఇప్పటి వరకూ ఎలాంటి పురోగతి సాధించలేదని, అందువల్ల కేసును ఏటీఎస్‌కు అప్పగించాలని పన్సారే కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటి వరకు దర్యాప్తు చేసిన వివరాలతో కూడిన పత్రాలను ఏటీఎస్‌కు సీఐడీ అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఏటీఎస్ పూనే విభాగం ఈ కేసు దర్యాప్తు బాధ్యతలు తీసుకుంటుందని చెప్పారు.

ఒకే పోర్టల్‌లోకి అన్ని అవార్డులు

న్యూఢిల్లీ: "పారదర్శకత, ప్రజా భాగస్వామ్యాన్ని నిర్ధారించేందుకు" వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ఏజెన్సీల అవార్డులన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఒక ఉమ్మడి పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పోర్టల్-రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ (అవార్డ్.గవ్.ఇన్) - ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ అవార్డులకు వ్యక్తులు, సంస్థలను నామినేట్ చేయడానికి ప్రతి పౌరుడు లేదా సంస్థను సులభతరం చేస్తుంది. పోర్టల్ ప్రస్తుతం వివిధ రకాల అవార్డుల కోసం నామినేషన్లు, సిఫార్సులను స్వీకరిస్తోంది. పద్మ అవార్డులకు నామినేషన్లు. సిఫార్సులకు చివరి తేదీ సెప్టెంబర్ 15 కాగా, అటవీ శాస్త్రంలో అత్యుత్తమ జాతీయ అవార్డు 2022కి ఆఖరు తేదీ సెప్టెంబర్ 30. జాతీయ గోపాల్ రత్న అవార్డు 2022కి కూడా చివరి తేదీ సెప్టెంబర్ 15, ఇది జాతీయ నీటి అవార్డులు 2022కి కూడా ఇదే చివరి తేదీ. నారీ శక్తి పురస్కారం 2023కి అక్టోబర్ 31 చివరి తేదీ. ఇక సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్ 2023కి చివరి తేదీ ఆగస్టు 31.

భారతరత్నకు సిసోడియా అర్హుడు

నన్ను, ఆయన్ను అరెస్టు చేస్తారేమో: కేజ్రీవాల్

అహ్మదాబాద్: ఢిల్లీ పాఠశాలల్లో విద్యారంగ ప్రమాణాలను మరింత మెరుగుపరిచినందుకుగాను ఉపముఖ్య మంత్రి మనీశ్ సిసోడియాకు భారత్‌రత్న ఇవ్వాల్సిన అవసరం ఉందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. దీనికి బదులుగా సిసోడియా, ఆప్‌పై కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని విమర్శించారు. రాజకీయ దురుద్దేశంతోనే సిసోడియా, ఇతర నేతలపై సీబీఐ, ఈడీ, ఐటీలను ప్రయోగిస్తోందని మండిపడ్డారు. తాము అనుసరిస్తున్న విద్యావిధానాన్ని న్యూయార్క్ టైమ్స్ సైతం ప్రశంసించిందని కేజ్రీవాల్ చెప్పారు. త్వరలో ఎన్నికలు జరగనున్న గుజరాత్‌లో కేజ్రీవాల్, ఉపముఖ్య మంత్రి మనీశ్ సిసోడియా పర్యటిస్తున్నారు. విద్యారంగం మెరుగుదలకు కృషి చేస్తున్న సిసోడియాను ప్రశంసించడానికి బదులు కేంద్రం లక్ష్యంగా చేసుకుందని సోమవారం ఇక్కడ సిసోడియాతో కలిసి విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు. బహుశా సిసోడియాను త్వరలో అరెస్టు చేయవచ్చన్న అనుమానాన్ని కేజ్రీవాల్ వెలిబుచ్చారు. 'మనీశ్ సిసోడియాను అరెస్టు చేయవచ్చు. నేను కూడా అరెస్టు కావచ్చేమో..ఎవరికి తెలుసు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఇలాంటివి జరగడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. గుజరాత్ ప్రజలు చాలా బాధలు అనుభవిస్తున్నారు. 27 ఏళ్ల బీజేపీ ప్రభుత్వ అహంకార పాలనపై ఆగ్రహంతో ఉన్నారని ఆయన చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీకి అధికారం అప్పగిస్తే రాష్ట్రంలో నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తామని కేజ్రీవాల్ ప్రజలకు హామీ ఇచ్చారు.

మనీశ్ సిసోడియా మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీని చీల్చితే తనకు ముఖ్యమంత్రి పదవి ఇస్తానని బీజేపీ ప్రతిపాదించిందని చెప్పారు. ఒకవ్యక్తి తన వద్దకు వచ్చి బీజేపీ ప్రతిపాదనలు వినిపించారన్నారు. ఆ ప్రతిపాదనలకు తాను స్పష్టమైన రాజకీయ సమాధానం చెప్పానన్నారు. 'ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నా రాజకీయ గురువు. ఆయన వద్దే నేను రాజకీయం నేర్చుకున్నాను. ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి కావాలని నేను రాజకీయాల్లోకి రాలేదు' అని సిసోడియా స్పష్టంచేశారు. ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న గుజరాత్‌లో రెండు రోజుల పర్యటన కోసం కేజ్రీవాల్, సిసోడియా అహ్మదాబాద్ వచ్చారు.

డ్రగ్స్‌కు కేంద్రం గుజరాత్

అయినా ప్రధాని మౌనం: రాహుల్

న్యూఢిల్లీ: గుజరాత్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్న మాదక ద్రవ్యాలపై మౌనమేమిటని ప్రధాని నరేంద్రమోదీని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. మోదీ సొంత రాష్ట్రం గుజరాత్...మాదక ద్రవ్యాలకు కేంద్రంగా మారిందని విమర్శించారు. దీనిపై ఎంతకాలం మౌనం వహిస్తారని నిలదీశారు. గుజరాత్‌లో మత్తు పదార్థాల తయారీ కేంద్రాన్ని ముంబై మాదక ద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులు కనుగొనడం, రూ.1026 కోట్ల విలువైన మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో రాహుల్‌గాంధీ ఈ విధంగా స్పందించారు. 'గుజరాత్‌లో మాదక ద్రవ్యాల సులభతర వాణిజ్యానికి అనుమతి ఉందా? ప్రధాని గారూ..ఈ ప్రశ్నకు సమాధానం చెప్పండి. గుజరాత్‌లో వేలకోట్ల రూపాయల మాదక ద్రవ్యాల వ్యాపారం జరుగుతోంది. గాంధీ- పటేల్ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఈ విషయం వ్యాప్తికి కారకులు ఎవరు?' అని రాహుల్ సోమవారం ఓ ట్వీట్‌లో ప్రశ్నించారు. మళ్లీ మళ్లీ డ్రగ్స్ స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ ఇప్పటి వరకు ఆ పోర్టు యజమానిని ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. గుజరాత్‌లో మాదక ద్రవ్యాల వ్యాపారం విచ్చలవిడిగా జరుగుతున్నా ఇప్పటి వరకు ఎన్‌సీబీ గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ డ్రగ్స్ మాఫియాను ఎందుకు అరెస్టు చేయలేదని అడిగారు. మాఫియా మిత్రులను కాపాడుతున్న పెద్దలెవరని ప్రశ్నించారు.

ప్రముఖులతో రాహుల్ భేటీ

కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు భారత్ జోడో యాత్రను కాంగ్రెస్ పార్టీ చేపట్టబోతోంది. దీనికి సంబంధించి ఇతరుల అభిప్రాయాలు తీసుకోవడానికి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఆయన పౌర సమాజం సభ్యులతో సమావేశమయ్యారు. సెప్టెంబరు 7 నుంచి భారత్ జోడో యాత్ర చేపట్టనున్నట్లు కాంగ్రెస్ ఇటీవల ప్రకటించింది. రాహుల్ సహా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇందులో పాల్గొంటారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో యోగేంద్ర యాదవ్, జైరాం రమేశ్, దిగ్విజయ్‌సింగ్ సహా అనేకమంది ప్రముఖ పౌర సమాజం సభ్యులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. భారత్ జోడో యాత్ర ప్రాముఖ్యత గురించి దిగ్విజయ్‌సింగ్ పౌర సమాజ ప్రతినిధులకు వివరించారు.

గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ: సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ బెయిల్ పిటిషన్‌పై సోమవారం సుప్రీం కోర్టు గుజరాత్ ప్రభుత్వం స్పందన కోరింది. అనంతరం కేసును ఆగస్టు 25కి వాయిదా వేసింది. 2002 గుజరాత్ అల్లర్ల కేసుల్లో "అమాయకులను" ఇరికించేందుకు కల్పిత సాక్ష్యాలను రూపొందించినందుకు సెతల్వాద్‌ను జూన్‌లో అరెస్టు చేశారు. జస్టిస్ యూయూ లలిత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆమె పిటిషన్‌పై రాష్ట్రానికి నోటీసులు జారీ చేసింది. ఆగస్టు 3న, గుజరాత్ హైకోర్టు ఈ పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఈ విషయాన్ని సెప్టెంబర్ 19కి విచారణకు వాయిదా వేసింది. దీనికి ముందు, జులై 30న అహ్మదాబాద్‌లోని సెషన్స్ కోర్టు ఈ కేసులో సెతల్వాద్, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆర్‌బి శ్రీకుమార్‌ల బెయిల్ దరఖాస్తులను తిరస్కరించింది. జూన్‌లో అరెస్టయిన సెతల్వాద్ శ్రీకుమార్ గోద్రా అనంతర అల్లర్ల కేసుల్లో "అమాయకులను" ఇరికించేందుకు కల్పిత సాక్ష్యాలను సృష్టించారని ఆరోపణలున్నాయి. ఈ కేసులో మూడో నిందితుడైన మాజీ ఐపీఎస్ అధికారి సంజీవ్ భట్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోలేదు. ఈ కేసులో అరెస్టయ్యాక భట్ అప్పటికే మరో నేరం కేసులో జైలులో ఉన్నారు.

ఆత్మాహుతి దాడి: మరో జవాను మృతి

జమ్ము: రాజౌరి ఆత్మాహుతి దాడిలో మరణించిన వారి సంఖ్య ఐదుకు చేరుకుంది. గాయపడిన మరో సైనికుడు ఉధంపూర్‌లోని ఉత్తర కమాండ్ సైనిక ఆసుపత్రిలో మరణించినట్లు సోమవారం అధికారులు తెలిపారు. ఆగస్టు 11న, రాజౌరిలోని ఆర్మీ క్యాంపుపై ఇద్దరు ఉగ్రవాదులు దాడి చేశారు. తెల్లవారుజామున జరిగిన ఆత్మాహుతి దాడిలో నలుగురు సైనికులు మరణించారు. ఇది మూడు సంవత్సరాల తర్వాత జమ్ముకశ్మీర్‌కు 'ఫిదాయీన్' తిరిగి వచ్చినట్లు సూచిస్తోంది. పాకిస్తాన్ ఆధారిత జైష్-ఎ-మహ్మద్‌కు చెందిన వారని భావిస్తున్న ఇద్దరు ఉగ్రవాదులు నాలుగు గంటల కాల్పుల తర్వాత హతమయ్యారు. భారత సైనికుడు హవల్దార్ సత్పాల్ సింగ్ ఆదివారం అర్థరాత్రి తీవ్రగాయాలతో మృతి చెందాడు. అతనితో, మృతుల సంఖ్య ఐదుకు చేరుకుందని అని ఒక అధికారి తెలిపారు. గాయపడిన జవాన్ ఉత్తర కమాండ్ ఆధారిత సైనిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉధంపూర్ కమాండ్ హాస్పిటల్‌లో పుష్పగుచ్ఛం ఉంచి, సత్పాల్ సింగ్ భౌతికకాయాన్ని రాజస్థాన్‌లోని స్వగ్రామానికి తరలించినట్లు వారు తెలిపారు.

యూజర్ ఛార్జీలు పెంచుతాం

ఏఈఆర్‌ఏని కోరిన అదానీ సంస్థ

మంగళూరు: ప్రయాణికుల నుంచి యూజర్ ఛార్జీలను పెంచుకునేందుకు అవకాశం కల్పించాలని అదానీ ఎయిర్‌పోర్ట్స్ నేతృత్వంలోని మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం (ఎంఐఏ) యాజమాన్యం ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఈఆర్‌ఏ) అధికారులను కోరింది. విమానాశ్రయంలో అభివృద్ధి కార్యకలాపాలను మరింత పెంచడానికి దేశీయ ప్రయాణీకులపై ఇప్పటికి అమలవుతున్న రూ.150కి అదనంగా రూ.100 మేర యూజర్ డెవలప్‌మెంట్ చార్జీలను తక్షణమే పెంచాలని కోరింది. అంతర్జాతీయ ప్రయాణికులపై విధిస్తోన్న రూ. 525ని రూ. 825 కి పెంచాలని కోరింది. ఈ పెంపును రానున్న అక్టోబరు నుంచి విమానాశ్రమంలో రాకపోకలు సాగించే ప్రయాణికులందరికీ వర్తించేలా అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. ఏఈఆర్‌ఏ టారిఫ్ ఫిక్సింగ్ బాడీ 2021 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకూ దేశీయ ప్రయాణికులపై రూ.150 నుంచి 250 వరకూ, విదేశీ ప్రయాణికులపై రూ.525 నుంచి 1,200 వరకూ పెంచేందుకు అనుమతించింది. అయితే విమానాశ్రయాన్ని ఆధునికీకరిస్తున్నామని, రన్‌వేలు, కొత్త టెర్మినల్, కార్గో టెర్మినల్ భవనాల నిర్మాణం సహా ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 5,200 కోట్లు ఖర్చవుతుందంటూ యూజర్ చార్జీలను పెంచుకునేందుకు అవకాశం కల్పించాలని కోరినట్టు తెలుస్తోంది. ఇక విమానాల రాకపోకలు, పార్కింగ్ ఛార్జీలను కూడా పెంచాలని ఆయా ఆపరేటర్లను కోరింది.

'పద్మ' పురస్కారాలకు సెప్టెంబరు 15 వరకు గడువు

న్యూఢిల్లీ: పద్మ పురస్కారాలు-2023 కోసం అభ్యర్థిత్వాలు/సిఫార్సులను సెప్టెంబర్ 15 వరకు సమర్పించవచ్చని కేంద్ర ప్రభుత్వం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. పద్మ అవార్డులు-2023 కోసం ఆన్‌లైన్ అభ్యర్థిత్వాలు/సిఫార్సుల స్వీకరణ మే 1, 2022న ప్రారంభమైంది. అవార్డుల కోసం సిఫార్సులను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో మాత్రమే స్వీకరిస్తారు. పద్మవిభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులు దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటి. 1954లో స్థాపితమైన ఈ పురస్కారాలను ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తారు. కళ, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక కృషి, విజ్ఞానం, ఇంజనీరింగ్, ప్రజా సంబంధాలు, పౌర సేవ, వాణిజ్యం, పరిశ్రమల వంటి అన్ని రంగాలు/విభాగాలలో విశిష్ట సేవలు, అసాధారణమైన విజయాలందించిన వారికి ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. జాతి, వృత్తి, స్థానం లేదా లింగ భేదం లేని వ్యక్తులందరూ ఇందుకు అర్హులు. వైద్యులు, శాస్త్రవేత్తలు మినహా ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న వారితో సహా ప్రభుత్వ ఉద్యోగులు పద్మ అవార్డులకు అర్హులు కాదు.

ఎంఎస్‌పీ కమిటీ భేటీకి ఎస్‌కేఎం దూరం

న్యూఢిల్లీ: కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)పై ఏర్పాటైన కమిటీ సోమవారం సమావేశమైంది. కనీస మద్దతు ధర సమర్థవంతంగా, పారదర్శకంగా ఉండటంతో పాటు అనేక అంశాలపై కమిటీ విస్తృతంగా చర్చించింది. అయితే, రైతు సమస్యలపై ఉద్యమాలు చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ప్రతినిధులు మాత్రం సమావేశానికి హాజరు కాలేదు. వ్యవసాయశాఖ మాజీ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ నేతృత్వంలోని కమిటీ...జీరో బడ్జెట్ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం, దేశ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పంటల మార్పిడి, ఎంఎస్‌పీని సమర్థవంతంగా, పారదర్శకంగా చేయడం వంటి అనేక అంశాలపై చర్చించింది.

స్థానికేతరులను అంగీకరించం

- కశ్మీరులో కొత్త ఓటర్లపై అఖిలపక్షం స్పష్టీకరణ
- తప్పుడు ప్రచారమంటున్న బీజేపీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ఓటర్ల జాబితాలో స్థానికేతరులను చేర్చాలన్న నిర్ణయం ఆమోదయోగ్యం కాదని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా స్పష్టం చేశారు. దీనిపై కోర్టు సహా అన్ని వేదికలపై సవాల్ చేస్తామని చెప్పారు. ఈ నిర్ణయం జమ్మూకశ్మీర్ గుర్తింపును హరిస్తుందని ఆయన అన్నారు. ఓటర్ల జాబితాలో స్థానికేతరులను చేర్చడంపై సోమవారం ఇక్కడ అఖిలపక్ష సమావేశం జరిగింది. 9 పార్టీలు సమావేశంలో పాల్గొన్నాయి. అత్యంత భద్రత గల గుప్కర్ ప్రాంతంలోని తన నివాసంలో అబ్దుల్లా ఏర్పాటు చేసిన సమావేశానికి పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, కాంగ్రెస్ జమ్మూకశ్మీర్ అధ్యక్షుడు వికార్ రసూల్, సీపీఎం నాయకుడు ఎంవై తరిగామి, శివసేన నాయకులు హాజరయ్యారు. సీపీఐ, జేడీయూ, అకాలీదళ్ మాన్ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే సజాద్ లోనె నేతృత్వంలోని పీపుల్స్ కాన్ఫరెన్స్, అల్తాఫ్ బుఖారీ నేతృత్వంలోని అప్నీ పార్టీ అఖిలపక్ష సమావేశానికి దూరంగా ఉన్నాయి. మరోవైపు ఎన్‌సీ సమావేశానికి పోటీగా ప్రతివ్యూహం రూపొందించడానికి బీజేపీ నాయకులు జమ్మూలో సమావేశమయ్యారు. అఖిలపక్ష సమావేశం అనంతరం అబ్దుల్లా విలేకరులతో మాట్లాడుతూ...ప్రభుత్వ చర్య జమ్మూకశ్మీర్ గుర్తింపును అంతం చేస్తుందన్నారు. 'అసెంబ్లీ బయటి వ్యక్తుల చేతుల్లో ఉంటుంది. ఇక్కడి ప్రజలు దానిని తిరస్కరించారు. ఈ అంశంపై చర్చించి అంగీకరించేది లేదని ఒక నిర్ణయానికి వచ్చాం' అని తెలిపారు. బయటి వ్యక్తులకు ఓటు హక్కు కల్పించే చర్యకు వ్యతిరేకంగా సమావేశంలో పాల్గొన్న అన్ని పార్టీలు ఏకమయ్యాయని అబ్దుల్లా చెప్పారు. స్థానికేతరులకు ఓటు హక్కు కల్పించడం వల్ల రాష్ట్ర గుర్తింపు పోతుంది. డోగ్రా, కశ్మీరీలు, పహరీలు లేదా గుజ్జార్ లేదా సిక్కు..ఇక్కడ నివసించే ఎవరైనా తమ గుర్తింపును కోల్పోతారు. అసెంబ్లీ బయటివారి చేతుల్లోకి వెళుతుంది. దీనిని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తాం. అసెంబ్లీ బయటివారి చేతుల్లోకి వెళ్లడాన్ని మేము అంగీకరించం' అని అబ్దుల్లా తేల్చిచెప్పారు. కాగా, అఖిలపక్ష సమావేశంపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఓటర్ల జాబితాలో స్థానికేతరులను చేరుస్తున్నారంటూ ప్రజల హృదయాల్లో విషం నింపేందుకు ఎన్‌సీ, పీడీపీ, ఇతర పార్టీలు ప్రయత్నిస్తున్నాయని బీజేపీ ఆరోపించింది. ఇక్కడ స్థానికులు, స్థానికేతరులు అనే సమస్యే లేదని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ దేశంలో ఎక్కడైనా ఓటు వేసే హక్కు పౌరులకు రాజ్యాంగం కల్పించిందని బీజేపీ నేత రవీందర్ రైనా చెప్పుకొచ్చారు. ఓటర్ల జాబితాల సవరణ తర్వాత కొత్తగా 25 లక్షలకు పైగా ఓటర్లు చేరే అవకాశం ఉందన్న వార్తలపై గత శనివారం ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇది స్వార్థ ప్రయోజనాల కోసం వాస్తవాలను తప్పుగా చూపించడమేనని పేర్కొంది. అయితే దీనిపై ఎన్‌సీ, పీడీపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి.

భారీ వర్షాలతో ఉత్తరాది అతలాకుతలం

- మధ్యప్రదేశ్‌లో కొన్ని పాఠశాలలకు సెలవు
- ఒడిశాలో ఉప్పొంగి ప్రవహిస్తున్న సువర్ణరేఖ నది
- రాజస్థాన్‌లోని కోటాలో లోతట్టు ప్రాంతాలు జలమయం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో సోమవారం మూడో రోజు కూడా భారీ వర్షాలు కురిశాయి. దీని ఫలితంగా రాష్ట్ర రాజధాని భోపాల్, జబల్‌పూర్‌తో సహా కొన్ని జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. ఐఎండీ సోమవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని పశ్చిమ ప్రాంతాల్లోని వివిధ ప్రదేశాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో నదులు, కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. నీటిని విడుదల చేయడానికి అనేక డ్యామ్‌ల గేట్లు తెరవబడ్డాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు ప్రయాణాలు విరమించుకోవాలని ప్రభుత్వం సూచించింది. సోమవారం భోపాల్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా భోపాల్‌లో అనేక చెట్లు నేలకొరిగాయి. అలాగే అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది రోడ్లపై పడిన చెట్లు, కొమ్మలను తొలగిస్తున్నారు.

ఒడిశాలో...

భువనేశ్వరం: ఉత్తర ఒడిశాలోని పలు జిల్లాల్లో సోమవారం వరద పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సువర్ణరేఖ నది లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. 100కి పైగా గ్రామాల ప్రజలను అతలాకుతలం చేసినట్లు అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా ఉత్తర ఒడిశాలో ఉన్న అన్ని నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బాలాసోర్, మయూర్ భంజ్ జిల్లాల్లోని అధికారులు ఆదివారం భారీ తరలింపు డ్రైవ్‌ను ప్రారంభించారని, ఇది సోమవారం కూడా కొనసాగుతుందని వారు తెలిపారు. ఆదివారం సాయంత్రం నుంచి సువర్ణరేఖ నది నీటి మట్టం గణనీయంగా పెరుగుతోందని, బలియాపాల్, భోగ్రాయ్, బస్తా, జలేశ్వర్‌లోని అనేక ప్రాంతాలను ముంచెత్తినట్లు అధికారులు తెలిపారు. ఉత్తర ఒడిశా జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ బులెటిన్‌లో పేర్కొంది. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదివారం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బాలసోర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. వరదల్లో చిక్కుకున్న మహిళలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్‌లు పంపిణీ చేయాలని కోరుతూ ఖుర్దా, పూరీ, కటక్, కేంద్రపారా, జగత్‌సింగ్‌పూర్, నయాగర్, బాలాసోర్, భద్రక్, కియోంజర్, బౌధ్ జిల్లాల కలెక్టర్లకు స్పెషల్ రిలీఫ్ కమిషనర్ పీకే జెనా లేఖ రాశారు.

రాజస్థాన్‌లో..

కోట/జైపూర్: గడచిన 24 గంటల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా రాజస్థాన్, కోటాలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని అధికారులు తెలిపారు. కోట బ్యారేజీ నుంచి విడుదలవుతున్న వరద నీటి కారణంగా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. బ్యారేజీ నుంచి ఇప్పటివరకు 2.76 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ ప్రకారం, కోటా, ఝలావర్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఝలావర్‌లోని దాగ్‌లో అత్యధికంగా 234 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కోటా నగరంలో 224 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. రాణా ప్రతాప్ సాగర్ డ్యామ్ (చిత్తోర్‌గఢ్), జవహర్ సాగర్ డ్యామ్ (కోటా) పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా చంబల్ నదిపై కోట బ్యారేజీలో నీటి ప్రవాహం పెరిగిందని కోట జిల్లా అధికారి తెలిపారు. 19 గేట్లలో 13 గేట్లను ఆదివారం రాత్రి తెరిచి నీటిని విడుదల చేయగా, సోమవారం మరో గేటు తెరిచినట్లు వారు వివరించారు. వాతావరణ పరిస్థితుల కారణంగా సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. తల్వండి, పురాణ కోటలోని కాలనీలు, బజరంగ్ నగర్, జవహర్ నగర్, స్టేషన్ రోడ్డు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన జల్లి విల్సన్, వనజ, కోటేశ్వరరావు, శంకర్ తదితరులు

దేశంపై అప్పులభారం

- ఆర్థిక సంక్షోభంతో రాజకీయ అనిశ్చితి
- కమ్యూనిస్టుల పునరేకీకరణ అవశ్యం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: మోదీ సర్కారు దేశంపై అప్పులభారం మోపిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. 2014 వరకు దేశంలో అప్పు 47 లక్షల కోట్ల రూపాయలు ఉంటే మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత దానిని 155 లక్షల కోట్ల రూపాయలకు పెంచారని తెలిపారు. ఆర్థిక సంక్షోభం రాజకీయ

అనిశ్చితికి దారితీస్తుందని హెచ్చరించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహాసభలో భాగంగా రెండవ రోజు సోమవారం ప్రతినిధుల సభ జరిగింది. మైలవరంలో జరిగిన సభకు సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పరుచూరి రాజేంద్ర, పీవీఎల్ గణేశ్వరమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. రామకృష్ణ దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితిని వివరించారు. శ్రీలంకలో రాజకీయ సంక్షోభానికి అక్కడ ఆర్థిక పరిస్థితే కారణమని రామకృష్ణ చెప్పారు. ప్రజలు తిరగబడితే అధ్యక్షుడు గొటబాయ పారిపోయారని గుర్తు చేశారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం జరుగుతుంటే అమెరికా తెలివిగా రష్యా పక్కలో బల్లెంలా ఉండాలని కోరుకుంటున్నదని చెప్పారు. దేశంలో ఎన్నికల విరాళాల కోసం ఇచ్చే ఎలక్ట్రోరల్ బాండ్స్ మొత్తం విలువ రూ.10వేల కోట్లు అయితే రూ.6వేల కోట్లు బీజేపీకి వచ్చాయని తెలిపారు. 2019లో బీజేపీ సొంత మెజార్టీతో అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా ఆర్ఎస్ఎస్ అజెండా అమలు చేయడం ప్రారంభించిందని విమర్శించారు. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి సుప్రీంకోర్టు అనుమతిస్తే ఇప్పుడు జ్ఞానవాపి ఆలయంలో మసీదు పడగొట్టాలని కోరుతున్నారని చెప్పారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాల వేళ కూడా కేంద్ర కేబినెట్‌లో ఒక్క ముస్లిం ప్రతినిధి మంత్రిపదవిలో లేరని చెప్పారు. ముస్లింలు మెజారిటీగా ఉన్న కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేశారన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మెజారిటీ హిందువుల ఓట్లు పొందటం, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించి డబ్బులు దండుకోవటం అనే రెండు ప్రధాన అంశాలపై పని చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మోదీ ప్రభుత్వ విధానాలను గుడ్డిగా సమర్థిస్తున్నదని దుయ్యబట్టారు. కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అదానీకి కట్టబెట్టిందని ఆరోపించారు. 32 మంది ప్రాణాలు కోల్పోయి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం దారుణమన్నారు. దేశంలో ఒక్క పరిశ్రమ నెలకొల్పని అసమర్థ ప్రధానిగా మోదీ నిలిచారని వ్యాఖ్యానించారు. కరోనా సమయంలో అశాస్త్రీయంగా వ్యవహరించారని, లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికుల పరిస్థితి అందరినీ కలచివేసిందన్నారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం కమ్యూనిస్టులు పునరేకీకరణ జరగాలని ఆకాంక్షించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలకులు కుల, మత, ప్రాంత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, పౌరహక్కులు ధ్వంసమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తీర్మానాలు చేసి ముందుకు సాగాలని సూచించారు.

ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ల దృష్టిలో కమ్యూనిస్టులు వెనుకబడిపోయారని, అందువల్ల స్థానికంగా మంచి నాయకత్వాన్ని ఎన్నుకొని...పాత నాయకులను కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు సయ్యద్ అఫ్సర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బుట్టి రాయప్ప, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు పంచదార్ల దుర్గాంబ, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి సీపీఐ నాయకులు హాజరయ్యారు.

సమసమాజ నిర్మాణంలో
కమ్యూనిస్టుల పాత్ర కీలకం

సీపీఐ కార్యదర్శి నారాయణ

మాట్లాడుతున్న నారాయణ. పక్కన హరినాథరెడ్డి, రామానాయుడు, నాగరాజు, జనార్ధన్ తదితరులు

విశాలాంధ్ర- చిత్తూరు: సమసమాజ నిర్మాణంలో కమ్యూనిస్టుల పాత్ర ఎంతో కీలకమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా 23వ జిల్లా మహాసభల ముగింపు సమావేశంలో నారాయణ మాట్లాడారు. జిల్లాలో పార్టీ బలోపేతం కావాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటాలు చేపట్టాలని, సమస్య ఉన్నచోటుకే సీపీఐ నాయకులు వెళ్ళి పరిష్కరించే దిశగా ఉద్యమ నిర్మాణం ఉండాలన్నారు. వచ్చే ఏడాదికి సభ్యత్వాన్ని రెండింతలు పెంచాలన్నారు. పార్టీ బలంగా ఉంటేనే మతోన్మాద శక్తులపై పోరాడే శక్తి వస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేందుకు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాల్సి ఉందని చెప్పారు. సంక్షేమ పథకాల అమలుతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్న పాలకులు బ్యాంకులకు వేలకోట్లు ఎగ్గొట్టిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. సుప్రీంకోర్టు కూడా ఈవిషయంపై మాట్లాడక పోవడం విచారకరమన్నారు. అటవీసంపదల్ని కార్పొరేట్లకు ఇస్తూ గిరిజన మహిళకు రాష్ట్రపతి పదవి ఇచ్చారన్నారు. ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం నిర్మించుకోవాలని, శాఖల పనివిధానం మెరుగుపడాలని సూచించారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్ సమావేశ మందిరంలో సీపీఐ నగరి నియోజక వర్గ కార్యదర్శి కోదండయ్య అధ్యక్షతన జరిగిన ఈ ప్రతినిధుల సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి హరినాథ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు, జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు, ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు టి జనార్ధన్ తదితరులు ప్రసంగించారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ మహాసభల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఐ వైఎస్ఆర్ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వైఎస్ఆర్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా గాలి చంద్ర ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. శని, ఆదివా రాలలో ఇక్కడ జరిగిన సీపీఐ జిల్లా మహాసభ 19 మంది అందులో నలుగురు ఆహ్వానితులు వీరితో కలిపి 59 మంది సమితి సభ్యులను ఎన్నుకున్నది. 1996లో ఏఐఎస్ఎఫ్‌లో చేరిన చంద్ర విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి విద్యార్థి లోకానికి అండగా నిలిచారు. 1999లో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్న కాలంలో ఎంసెట్ పరీక్షల నిర్వాహణలో తమ వంతు కృషి చేశారు. 2005లో కడప సిటీ సెక్రటరీగా పనిచేస్తున్న హయాంలో నగర సుందరీకరణకు, భూకబ్జాలకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా పాత రిమ్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు, మున్సిపల్ ఆస్తుల పరిరక్షణ కోసం పోరాటాలు నిర్వహించారు. 2016లో ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రైతాంగ సమస్యలపై, ప్రాజెక్టు లపై పోరాడటమే కాక బుగ్గవంక నిర్వాసితు 1లకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన వాటిపై సమగ్ర పోరాటాలు నిర్వహించారు.

కొలువులు అడిగితే కొడతారా?

పాట్నా: బీహర్‌లో నిరుద్యోగులు కదం తొక్కారు. టీచింగ్ పోస్టుల కోసం ఎదురు చూస్తోన్న వందలాది మంది రోడ్డెక్కారు. తమ కొలువులు తమకు ఇవ్వాలని కోరారు. సోమవారం పాట్నాలో చేపట్టిన ఆందోళన హింసాత్మక పరిస్థితులకు దారి తీసింది. ఓ అభ్యర్థిని పోలీస్ అధికారి కొడుతున్న వీడియో వైరల్ అయ్యింది. జాతీయ జెండా పట్టుకున్న ఓ అభ్యర్థి.. తనను కొట్టారని భావిం చారు. అయినా ఓ పోలీస్ వినిపించుకోలేదు. లాఠీతో దాడి చేశాడు.పాట్నాలో గల డాక్ బంగ్లా చౌరాహ వద్ద తమ కొలువుల ప్రక్రియ పూర్తి చేయాలని నిరుద్యోగులు ప్రదర్శన చ పట్టారు. దీంతో ఘటనాస్థలానికి భారీగా పోలీసులు చేరుకున్నారు. వారితోపాటు సీటీఈటీ, బీటీఈటీ అభ్యర్థులు తమకు ప్రైమరీ టీచర్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ప్రకారం ఖాళీలు భర్తీ చేయాలని కోరారు.

ఆప్‌ను చీలిస్తే సీఎం చేస్తారట

అహ్మదాబాద్/న్యూఢిల్లీ: ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సోమవారం సంచలన అంశాలు బయటపెట్టారు. తాను బీజేపీలో చేరితే ఢిల్లీ ముఖ్యమంత్రిని చేస్తానని, తనపై ఉన్న సీబీఐ, ఈడీ కేసులన్నీ ఎత్తివేస్తానని ప్రతిపాదించిందని సిసోడియా చెప్పారు. ఈ మేరకు బీజేపీ తనకు సందేశం పంపిందన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ని వీడి బీజేపీలో చేరితే సీబీఐ, ఈడీ కేసులన్నీ ఎత్తివేస్తామని, మహారాష్ట్రలో శివసేన తరహాలో ఆప్‌ను చీలిస్తే ముఖ్యమంత్రిని చేస్తామన్న ప్రతిపాదనలు తన ముందుంచిందని వివరించారు. సిసోడియా ఆరోపణలపై బీజేపీ స్పందించింది. అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సిసోడియా అలాంటి ఆరోపణలు చేస్తున్నారని చెప్పుకొచ్చింది.

తాను తలనైనా నరుక్కుంటాను గానీ బీజేపీ ప్రతిపాదనలకు లొంగిపోయేవాడిని కాదని సిసోడియా స్పష్టంచేశారు. 'నాకు బీజేపీ నుంచి ఒక సందేశం వచ్చింది. సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల్ని మూసివేసేందుకు.. ఆప్‌ను వీడి, బీజేపీలో చేరాలని అందులో కోరారు. కానీ నేనొక రాజ్‌పుత్‌ను. మహా రాణాప్రతాప్ వారసుడిని. నేను నా తలనైనా నరుక్కుంటాను కానీ, అవినీతి, కుట్రదారుల ముందు మాత్రం తలవంచను. నాపై పెట్టినవన్నీ తప్పుడు కేసులే. మీరు ఏం చేయాలనుకుంటే అది చేసుకోండి. నాకొచ్చిన సందేశానికి ఇదే నా సమాధానం' అంటూ మనీశ్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌తో కలిసి రెండు రోజుల పర్యటన కోసం సిసోడియా అహ్మదాబాద్ వచ్చారు.

సిసోడియా ఆరోపణలపై బీజేపీ జాతీయ కార్యదర్శి గౌరవ్ భాటియా న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో స్పందించారు. కేజ్రీవాల్ నిస్పృహలో ఉన్నారని, బీజేపీ నుంచి తనకు సందేశం వచ్చిందని సిసోడియా చెబుతున్నారని, ఆ వచ్చిన వ్యక్తి ఎవరో వెల్లడించాలని భాటియా కోరారు. అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఆప్ నాయకులు నాటకాలాడుతున్నారని ఎదురుదాడి చేశారు.

తనతో పాటు చాలినంత మంది ఎమ్మెల్యేలను తెచ్చుకుంటే ఢిల్లీ సీఎంను చేస్తామని సిసోడియాకు బీజేపీ ఆశ చూపించిందని, ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ చాలాకాలంగా కుట్ర చేస్తున్నారని ఆప్ నాయకులు విమర్శించారు. ఆప్ నిజాయతీ గల పార్టీ అని, మహారాష్ట్ర తరహాలో చేయాల్సిన చూస్తూ ఇక్కడ సాధ్యం కాదని స్పష్టంచేశారు. పశ్చిమబెంగాల్‌లో నాటి తృణమూల్ నాయకులు సువేందు అధికారి, ఇతర నేతలతో సంప్రదింపులు జరిపిన వ్యక్తే సిసోడియాతోనూ మాట్లాడారని ఆప్ ఎమ్మెల్యే అతిషి చెప్పారు. పార్టీలో చేరితే వచ్చే ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రివి నీవేనని సిసోడియాకు ప్రతిపాదించినట్లు ఆప్ ముఖ్య అధికార ప్రతినిధి భరద్వాజ్ తెలిపారు. ఇలాంటి ప్రతిపాదనలతో సిసోడియాను కలిసిన నాయకుడి పేరు ఏమిటని ప్రశ్నించగా సరైన సమయంలో వాస్తవాలు బహిర్గతం చేస్తామని ఆయన చెప్పారు. కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం విధానంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. మద్యం విధానంలో నిబంధనల ఉల్లంఘనలు జరగడంతోపాటు విధానపరమైన లోపాలు ఉన్నట్లు ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివేదిక ఇచ్చారు. టెండర్ల విధానంలో కొందరికి అయాచిత లబ్ధి చేకూరేలా నిర్ణయాలు తీసుకున్నట్లు నివేదికలో తెలిపారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.